వందకు పదివేలు

వసుంధర

అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో ఎవరో తలుపు తట్టిన చప్పుడు విని సుబ్బారావుకు మెలకువ వచ్చింది.

చేతికి అందుబాటులో వున్న పుష్‌బటన్ స్విచ్ నొక్కి దీపం వేశాడు. గదంతా వెలుతురుతో నిండింది. అతని భార్య వనజ చిరాగ్గా "హుఁ" అని మూలిగి, దుప్పటి ముఖం మీదకు లాక్కుని, ప్రక్కకు తిరిగి పడుకుంది.

సుబ్బారావు మంచం దిగాడు. వీధి తలుపు ఇంకా చప్పుడవుతూనే వుంది.

ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని, గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళి తలుపు తీసాడు. ఆగంతకుడి ముఖం పరిచయమైనదిగా తోచలేదతనికి.

"ఎవరది?" అన్నాడు సుబ్బారావు.

"సుందర్రావుగారిల్లేదా నాండీ?" అన్నాడతను అడుగు లోపలకు వేస్తూ.

"కాదు" అన్నాడు సుబ్బారావు ఇబ్బందిగా ముఖం పెట్టి.

ఆగంతకుడు ఆగలేదు. ఇంకా లోపలకు వస్తూనే, "పోనీ ఏదో చెప్పగలరా?" అనడిగాడు.

"నాకు తెలియదు" అన్నాడు సుబ్బారావు ముక్తసరిగా.

ఆగంతకుడు వెళ్ళి కుర్చీలో కూర్చుని, "పోనీ తెలును కునేదాకా నేనిక్కడుండొచ్చా?" అనడిగాడు.

ఈసారి అంత తేలిగ్గా సమాధానం దొరకలేదు సుబ్బారావుకి. విస్మయంగా అతనినే చూడసాగాడు.

ఆగంతకుడు నవ్వి, "మీరు చాలా మర్యాదస్తుల్లా కనబడుతున్నారు. కాదనలేరనే నా నమ్మకం" అన్నాడు.

సుబ్బారావు ఇబ్బందిగా నవ్వి, "మీరూ మర్యాదస్తుల్లాగానే ఉన్నారు. కాదనడం కష్టమే! కానీ ఇల్లు చిన్నది. అరుగుమీద పడుకుంటే మీ కిబ్బందిగా ఉండదను కుంటాను" అని, "అలా కూర్చునే ఉండండి. మంచం తీసుకు వస్తాను" అన్నాడు.

ఆగంతకుడు సుబ్బారావుని దగ్గరకు రమ్మనమని పిలిచాడు. సుబ్బారావు వెళ్ళాడు. స్వరం తగ్గించి, "నా దగ్గర చాలా డబ్బుంది. బయట పడుకుంటే ప్రమాదం" అన్నాడాగంతకుడు.

సుబ్బారావు గతుక్కుమన్నాడు, "మరింట్లో కాళీ లేదే!" అన్నాడు.

"ఈ గదిలో నే పడుకుంటాను" అన్నా డాగంతకుడు.

"చూడండి. ఈ ఇంటికి రెండే గదులు. దీన్నానుకు నే మా పడకగది ఉంది. మేము బాత్రూముకీ వాటికీ వసల డానికీ గదిలోంచే వెళ్ళాలి. మగవాళ్ళయితే ఇబ్బందిలేదు కానీ ఆడవాళ్ళతో కాస్త ఇరకాటమే గదా!"

"ఓహ్‌ కొత్త దంపతులనుకుంటాను" ఆగంతకుడు నవ్వాడు.

"మరీ కొత్తవాళ్ళంకాదులెండి. కాపురంపెట్టి ఏడాది పూర్తయింది" అన్నాడు సుబ్బారావు కాస్త విసుగ్గా.

ఆగంతకుడు కాసేపు సీరియస్‌గా ఆలోచించి తన చేతి లోని బ్రీఫ్‌కేసుని సుబ్బారావు కందించాడు. "చూడండి. ఇది నా ప్రాణం. నా ప్రాణాలుపోయినా దీన్ని వదలను. ఏ పరిస్థితుల్లోనూ దీన్ని తెరవడానికి ప్రయత్నించవద్దు. నాకోసం దాచి ఉంచండి. నేను బయట పడుకుంటాను. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, తెల్లవారేసరికి నేను మీ ఇంటరుగుమీద కనపడలేదనుకోండి. కంగారుపడ కండి. పెట్టెకోసం నేను మళ్ళీ వస్తాననిమాత్రం గుర్తుంచు కోండి" అన్నాడు.

సుబ్బారావది అందుకున్నాడు. చాలా బరువుగా వుంది. అతని గుండెలుకూడా బరువెక్కాయి. ఊపిరికూడా బరు వుగా తీశాడు. పెట్టె సుబ్బారావు బెడ్రూంలో బీరువా లోపలకు చేరుకుంది. ఒక మంచం, దుప్పటీ, తలగడా వీధరుగుమీదకు వచ్చాయి. ఆగంతకుడు వీధిలోకి దారి తీస్తూండగా సుబ్బారావు అన్నాడు – "ఇంతకీ మీ పేరు తెలుసుకోలేదు."

"నా పేరు భయంకర్!" అన్నాడతను.

అతను సుబ్బారావు పేరడగలేదు. చెప్పడానికి సుబ్బారావుకీ భయం వేసింది.

సుబ్బారావు వీధి తలుపులు వేశాడు. పడకగదిలోకి వచ్చి పక్కలో దూరాడు. ఒకసారి చిరాగ్గా మూలిగి, చంటిపిల్లలా అతని దగ్గరగాచేరి చేయి మీద వేసుకుని పడుకుంది వనజ.

2

"బాబుగారూ! పాలు తీసుకొచ్చాను!"

పాలవాడి కేక విని సుబ్బారావు లేచాడు. వనజది మొద్దు నిద్ర. ఓ పట్టాన ఆమెకు మెలకువరాదు. అందులోనూ ఉదయం ఆరుగంటల ప్రాంతాలకే లేవాలంటే ఆమెకు అసాధ్యం. అందుకే పాలు పోయించుకునే డ్యూటీ రోజూ సుబ్బారావుదే. అందరిళ్ళలోనూ అమ్మగారూ అని కేకపెట్టే పాలవాడు సుబ్బారావింటికి రాగానే అప్రయత్నంగానే బాబుగారూ అంటాడు.

సుబ్బారావు తలుపు తీశాడు. పాలవాడు అతని చేతిలోని గిన్నెలో పాలుపోస్తూ, "అయ్యగారూ, అలా పక్కబట్టలూ అవీ వేసి మంచం అరుగుమీద వదిలేశారేంటండీ. ఎవరైనా ఎత్తుపోరూ" అన్నాడు.

ఉలిక్కిపడి చూశాడు సుబ్బారావు. మంచం ఖాళీగా వుంది. అతనికింకా కొద్దిపాటి నిద్రమత్తుండి వుంటే ఈ దెబ్బతో వదిలిపోయింది. పాలవాడికి సమాధానమేమీ ఇవ్వకుండా పాలగిన్నె తీసుకుని లోపలకు వెళ్ళాడు.

పాలగిన్నె వంటింటి అలమారాలో పెట్టి మళ్ళీ వీధరుగు మీదకు వచ్చాడు సుబ్బారావు. అతను పక్క పరీక్షించి చూశాడు. దానిమీద మనిషి పడుకున్న ఛాయలు కనపడుతున్నాయి.

సుబ్బారావు తలగడా ఎత్తి చూశాడు. క్రింద ఏమీ చీటీ లేదు. అతను పక్కదులిపి మడతపెట్టాడు. పక్కచుట్టను ఒక చేత్తోనూ, మంచాన్నొక చేత్తోనూ పట్టుకుని ఇంట్లోకి వెళ్ళాడు.

ముఖం కడుక్కుంటూ కూడా ఆ వ్యక్తి గురించే ఆలోచిస్తున్నాడు సుబ్బారావు. ఎవరతను? అర్ధరాత్రివేళ తనింటికి ఎందుకు వచ్చాడు? తనవద్ద పెట్టె దాచమనడం వరకూ బాగానే ఉంది. ఆ తర్వాత పెట్టె తీసుకోకుండానే ఎందుకు వెళ్ళిపోయాడు?

అప్పుడే అతనికి రాత్రి ఆ వ్యక్తి చెప్పినమాటలు గుర్తుకొచ్చాయి. ఉదయం లేచేసరికి తను కనపడక పోయినా కంగారు పడవద్దనీ, పెట్టెను దాచి ఉంచమనీ చెప్పాడు. తన ప్రాణాలు పోయినా పెట్టెను వదలననీ దాని గురించి మళ్ళీ వస్తాననీకూడా చెప్పాడతను. అతని పేరు భయంకర్!

ఆ పెట్టెలో ఏదో విశేషముండి ఉంటుంది. దానికోసం ఈ వ్యక్తినెవరో వెంటాడుతున్నారేమో - అతగాడికన్ను కప్పి భయంకర్ తన ఇంట్లో దూరి ఉంటాడు. పెట్టెను దాచేక అరుగుమీద పడుకున్నాక - ఏదో కొత్త పరిస్థితి ఏర్పడి ఉంటుంది. తప్పనిసరిగా అతను తన ఇల్లు వదిలి పెట్టవలసి వచ్చి ఉంటుంది. ఏమిటీ అనూహ్య పరిస్థితి?

ఆలోచించిన మీదట సుబ్బారావుకి-పెట్టెపట్ల తనకూ బాధ్యత ఉన్నదనిపించింది. భయంకర్ మంచివాడో, చెడ్డవాడో తెలియదు కానీ ప్రమాదకరమైన వ్యక్తి!

తన ఇంట్లోని పెట్టె గురించి మరెవరైనా వచ్చి అడగవచ్చు. తన ఇల్లు శోధించవచ్చు. పెట్టె తన ఇంట్లోంచి మాయమైపోతే - అది అతని ప్రాణంకంటె ఎక్కువ అన్నాడు కాబట్టి, భయంకర్ తననేమైనా చేయవచ్చు.

తన్ను తను రక్షించుకోవడంకోసం పెట్టెను భద్రంగా దాచాలి. దానివల్ల తనకు కృతజ్ఞతగా ఏదైనా బహుమతి కూడా ముట్టే అవకాశం వుంటుంది.

సుబ్బారావింట్లో పెద్ద ట్రంకుపెట్టె ఉంది. దానిలో వనజ పాతబట్టలు పెడుతూంటుంది. సామాన్యంగాఎప్పుడో గాని ఆ పెట్టెను ముట్టదు. సుబ్బారావా ట్రంకు తెరిచి— భయంకర్ ఇచ్చిన బ్రీఫ్ కేసుని తెచ్చి అందులోపెట్టి పాత బట్టలన్నీ జాగ్రత్తగా సర్దాడు. ఎవరైనా ఆ పెట్టె తెరవగానే అందులో మోడ్రన్ బ్రీఫు కేసుకోసం వెతికే ఆలోచన కట్టిపెట్టి వెంటనే మూత వేసేస్తారు.

సుబ్బారావు తృప్తిగా పెట్టె మూత వేశాడు. కావాలనే దానికి తాళం వేయలేదు. అలాంటి బట్టలున్న పెట్టెకి తాళముంటే ఎవరికైనా అనుమానం రావచ్చు.

3

"హలో—ఎవరండీ—" అన్నాడు సుబ్బారావు రిసీవర్ ఎత్తి.

"నాపేరు భయంకర్!" కంఠం కాస్త పరిచయమైనదిగా తోచింది సుబ్బారావుకి. అతను వెంటనే ఉత్సాహంగా "నమస్కారమండీ—నేను సుబ్బారావుని మాట్లాడుతున్నాను. రాత్రి మీరు మా ఇంటికొచ్చారుకదా-మీ రిప్లై డెక్కణ్ణుంచి మాట్లాడుతున్నారు?" అన్నాడు.

"చెప్పకూడదు. మీరు ఫోన్లో నా పేరుచ్ఛరించ వద్దు. పెట్టె ప్రసక్తికూడా తీసుకురావద్దు. భద్రంగా దాచి ఉంచండి. నేనే ఎప్పుడో మీ ఇంటికి వస్తాను. దాన్ని తీసుకువెడతాను. ఎప్పుడైనా ఎవరైనా మీ ఇంటికి వచ్చి దాని గురించి అడగవచ్చు. నేను తప్ప మరెవ్వరు వచ్చినా ఆ పెట్టె గురించి మీకేమీ తెలియదని బుకాయించండి.

నా విరోధులు చాలా జిత్తులమారి వాళ్ళు. రకరకాల మారువేషాల్లో దానికోసం మీ ఇంటికి రావచ్చు. నా పేరుకూడా చెప్పవచ్చు. నేనువస్తే తప్ప మరెవ్వరికీ ఆ పెట్టె ఇవ్వవద్దు ఇది విన్నపమే కాదు, హెచ్చరిక కూడా. మిత్రులకు ప్రాణం ఇస్తాను. మిత్రద్రోహం చేస్తే ప్రాణం తీస్తాను. మీరు నా మిత్రుల జాబితాలో చేరారు—" అన్నాడు భయంకర్.

సుబ్బారావు ఇబ్బందిగా - "బాగానే ఉంది. కానీ ఇంకా ఎన్నాళ్ళు?" అనడిగాడు.

"జవాబు నాకూ తెలియదు—" అవతల క్లిక్ మంది.

సుబ్బారావు ఫోన్ క్రేడిల్ మీద పెట్టేసి—మళ్ళీ తన సీట్లోకి వెళ్ళిపోయాడు.

ఏదో మిస్టరీలో చిక్కుకున్నానన్న భయం సుబ్బారావు నావహించింది. మిత్రద్రోహానికి ప్రాణాలు తీస్తానన్నాడు భయంకర్. భయంకర్ శత్రువులు జిత్తులమారి వాళ్ళని కూడా చెప్పాడు. తను సాధారణ వ్యక్తి. ఆ జిత్తులమారి వాళ్ళ కుయుక్తుల్ని దాటుకుని-భయంకర్ దృష్టిలో తను మిత్రద్రోహి కాకుండా ఉండగలడా?

ఆ తర్వాత అతను ఆఫీసులో ఆట్టే వర్కు చేయలేకపోయాడు. అతను ఇంటికి వెళ్ళేసరికి వనజ గుమ్మంలోనే నిలబడి ఉంది. ఆమె ముఖంలో ఆశ్చర్యం కొట్టవచ్చినట్లు కనబడుతోంది. అతను గుమ్మందగ్గరకు రాగానే— "ఏమండీ—ఈ రోజు ఒక చిత్రం జరిగింది!" అంది.

"ఊఁ" అన్నాడు సుబ్బారావు. వనజకు ఈ ప్రపంచంలో ప్రతి చిన్న విషయమూ ఆశ్చర్యంగానే కన్పిస్తుంది. ఆ కన్పించిన ప్రతీదీ భర్తకు చెప్పేదాకా ఆమెకు తోచదు.

అందుకే సుబ్బారావు ఆమె చిత్రం అంటే చలించడు.

"మీరాఫీసుకు వెళ్ళిన అరగంట తర్వాత ఒక ఆడ మనిషి మనింటికొచ్చింది. మన పనిమనిషి చుట్టాన్నని చెప్పింది. మన పనిమనిషి ఎవరిదో ఎరుపు ఉంగరం పెట్టుకొచ్చిందిట. ఇప్పుడు దాని చేతికి లేదుట. మనింట్లో ఇల్లూడుస్తూండగా పడిపోయుంటుందని దాని అనుమానమట. తనకు కాళ్ళూ చేతులూ ఆడ్డంలేదని వెతకడానికి తన్ను పంపించిందని చెప్పింది. సరే నేను దగ్గరుండి దాన్ని ఇల్లంతా జాగ్రత్తగా మరోసారి ఊడ్చనిచ్చాను, ఇల్లూడుస్తూ శ్రద్ధగా వెతకాలా—అందుకు బదులు—నాతో కబుర్లకు దిగిందది—" వనజ ఆగింది.

"ఏం మాట్లాడిందేమిటి?" అనడిగాడు సుబ్బారావు ఏదో అనుమానంగా. ఈ పర్యాయం కాస్త నిజమైన విశేషమే వనజ చెప్పనున్నదనిపించింది సుబ్బారావుకి.

"నిన్న అర్ధరాత్రివేళ మీ ఇంటికెవరో చుట్టాలొచ్చారుట గదమ్మా—అనడిగిందండీ—" అంటూ నవ్వింది వనజ.

సుబ్బారావుకి నవ్వురాలేదు. అతని ముఖం సీరియస్‌గా మారింది. "ఊఁ" అన్నాడతను.

"ఎవరు చెప్పారు?" అన్నాను. అది మాట్లాడకుండా మళ్ళీ ఇల్లూడడ్వం మొదలుపెట్టింది. మళ్ళీ కాసేపుండి— 'ఆయనేమవుతారమ్మా మీకు—' అనడిగింది. 'ఎవరు?' అన్నాను చిరాగ్గా. ఆదే నిన్నటర్ధరాత్రొచ్చిన మనిషి— అందది. నాకిహ నవ్వాగలేదనుకోండి—" వనజ నవ్వడం ప్రారంభించింది.

సుబ్బారావు ఓపికగా ఆమె నవ్వు ముగిసేదాకా కూర్చున్నాడు. "ఆ తర్వాతేమయిందో చెప్పు—" అన్నాడు.

"ఏమవడానికేముంది. మనింటి కెవ్వరూ రాలేదని చెప్పాను. చీమ చిటుక్కుమంటే లేస్తాను. అర్ధరాత్రి మనింటికి చుట్టమొస్తే తెలియకుండా ఉంటానా మీరే చెప్పండి—" అంది వనజ.

వనజకు గట్టి నమ్మకం—తను చాలా మెలకువగా ఉండగలనని. సుబ్బారావు ఎన్ని నిదర్శనాలు చూపించినా ఆమె నమ్మదు.

ఇప్పుడు సుబ్బారావుకి నవ్వొచ్చింది. "సరేలే—కానీ ఆ తర్వాతేమైంది—"

"అది ఓ పట్టాన నమ్మలేదు. లక్ష ప్రశ్న లేసింది. మీ చుట్టం తనొచ్చినట్లెవ్వరికీ చెప్పొద్దన్నాట్టగా. ఏదో పెట్టె ఇచ్చి దాచమన్నాట్టగా. అందుకే నాతో నిజం చెప్పడం లేదులెండి—అందది. నాకింక ఒళ్ళుమండి——ఏమిటీ ఎక్కువేతలు—అంత రహస్యంగా రావాల్సిన చుట్టాలెవ్వరూ మాకులేదు. మేమేమన్నా దొంగలనుకున్నావా?—అని దెబ్బలాడాను. అది తగ్గి—ఏదో పిచ్చిముండని, పిచ్చివాగుడు వాగాను క్షమించండమ్మా—అనేసింది. దాని ఉంగరమూ దొరకలేదు. అది పెద్ద బాధపడ్డట్లూ అన్పించలేదు."

"అంతేనా ఇంకా ఏదైనా జరిగిందా?"

"మధ్యాహ్నం మన పనిమనిషొచ్చినప్పుడడిగితే—అది ఎరువుకైతేమాత్రం ఉంగరం తెచ్చిపెట్టుకునే తాహతెక్కడిదమ్మా నాకు—అనేసింది. జరిగింది చెబితేవిని—అదెవత్తో దొంగముండ యుంటుంది. ఇంట్లోంచేదైనా పట్టుకుపోయిందేమో చూసుకోండి—ఇది ఒక్క మనింట్లో మాత్రమే కాదు—చుట్టుపక్కల అది పనిచేసే రెండు మూడిళ్ళలోకూడా ఇలాగే జరిగిందట—" అంది వనజ.

సుబ్బారావుకు తెలిసిపోయింది. ఆ వచ్చిన ఆడమనిషి భయంకర్ విరోధుల ముఠాకు చెందినదై ఉంటుంది. అయితే వాళ్ళకింకా భయంకర్ రాత్రి ఏ ఇంటికి వెళ్ళాడన్నది తెలియదు. చెప్పుకోదగ్గ అదృష్టమేమిటంటే వనజకు బాగా నిద్రపట్టే అలవాటుండడం. అందువల్లే భయంకర్ వచ్చివెళ్ళిన సంగతే ఆమెకు తెలియదు.

"ఇంతకూ ఉంగరం వెతకడానికొచ్చిన ఆ ఆడమనిషెలాగుంది?" అనడిగాడు సుబ్బారావు.

వనజ గుర్రుగా చూసింది భర్తవంక. "మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. నేను చెప్పిన దాంట్లో మీకు కుతూహలం కలిగించిందా మనిషిరూపం ఒక్కటేనన్నన్నమాట."

"ఛా. నీలాంటి అందమైన భార్యగా ఉండగా పనిమనుషులకేసి చూస్తానని ఎలాగనుకున్నావ్?" అన్నాడు సుబ్బారావు లాలనగా.

"ఆ మనిషి మరీ అంత పనిమనిషిలా లేదు. కాస్త మాసిన బట్టలైతే కట్టుకుంది. కానీ మనిషి చాలా అందంగా ఉంది. చెప్పాలంటే సినిమాల్లో చూపిస్తారూ, హీరోయిన్ని పనిమనిషిగా. అలాగుంది."

సరే. ఎప్పుడో ఒకప్పుడామెను మళ్ళీ చూసే అవకాశం రాకపోదులే అనుకున్నాడు సుబ్బారావు.

4

"నా పేరు సుధ" అన్నదామె తీయగా.

సుబ్బారావు మరొక్క పర్యాయం ఆమెను పరీక్షించి చూశాడు.

నీలంరంగు చీర. అదే రంగు బ్లౌజు. నాజూకైన శరీరం.

అందమైన ముఖం. ఇరవైకి మించని వయసు. ఇవన్నీ
కూడా ఆమెను ఆకర్షణీయంగా తయారుచేశాయి.

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ" అనడిగాడు సుబ్బా
రావు.

"ఈరోజు సాయంత్రం మా ఇంటికి టీకి రావాలి."

"మీ రెవరో నాకు తెలియదు. అటువంటప్పుడు..."
నసిగాడు.

సుబ్బారావుకి ఆడపిల్ల ఆహ్వానాన్ని కాదనడం కష్టమే
కానీ ఇది మరీ బొత్తిగా అర్థంలేకుండా ఉంది.

"నాకుమాత్రం మీరు తెలుసా? అయినా నేను ఆహ్వా
నించాను. నేను వయసులో ఉన్న ఆడపిల్లని. ఒంటరిగా
ఇంట్లో ఉంటున్నదాన్ని. మీబోటి యువకుడి నాహ్వా
నించడంలో రిస్కు నాకే ఉందికానీ మీకేముంది?"

ఆ యువతి సుబ్బారావుకి ఒక చిన్న కాగితం అందిం
చింది. "ఇది నా అడ్రస్. సాయంత్రం ఆరున్నర గంటలకు
నా ఇంట్లో ఎదురుచూస్తుంటాను. తప్పక రాగలరని
ఆశిస్తున్నాను" అని ఆమె వెనక్కి తిరిగింది.

ఆమె నడకలో ఒక సొగసు, కదలికలో ఒక సొగసు.
ఎవరీ వయ్యారిభామ? అనుకున్నాడు సుబ్బారావు.

అతను అయిదుగంటలకు ఇంటికి వెళ్ళేసరికి అక్కడ
ఒక కవరు అతనికోసం ఎదురుచూస్తోంది. అతనికది
అందించి టిఫిన్ తేవడాని కింట్లోకి వెళ్ళింది వనజ.

సుబ్బారావు కవరు చింపి లోపలి కాగితం బయటకు
తీశాడు. ఉత్తరం ఇంగ్లీషులో రాసి ఉంది. అది భయంకర్
రాశాడు. పెట్టె ఇచ్చి అప్పుడే మూడువారాలు దాటి
పోయింది గదా అని అజాగ్రత్తగా ఉండవద్దనీ, తను
పెట్టెను తీసుకువెళ్ళడాని ఎప్పుడో ఒకప్పుడు తిరిగి

రాగలననీ రాశాడతను. సుబ్బారావు ఉత్తరాన్ని జేబులోకి తోసేశాడు.

"ఎక్కణించండీ ఉత్తరం!" టిఫిన్ తీసుకొచ్చి అడిగింది వనజ.

"ఆఫీసులోని నా కొలీగ్ రాశాడులే. ప్రస్తుతం అతనూళ్ళో లేడు. మామూలు ఉత్తరమే" అన్నాడు సుబ్బారావు.

వనజకు ఇంగ్లీషు రాదు. చాలాసార్లు దానివల్ల నష్టాలు కనపడ్డా ప్రస్తుతం ప్రయోజనం కనపడిందతనికి.

టిఫిన్ తీసుకోవడమయేక అతను మళ్ళీ ట్రిమ్‌గా తయారవడం చూసి, "ఎక్కడికండోయ్ మళ్ళీ బయల్దేరుతున్నట్లున్నారు? నేనూ తయారుకావాలా?" అనడిగింది వనజ.

"లేదు. చిన్న పనిమీద వెడుతున్నాను. మళ్ళీ తొందరగానే వచ్చేస్తాను" అంటూ సుబ్బారావింట్లోంచి బయటపడ్డాడు.

5

అదొక చిన్న డాబా ఇల్లు. సుబ్బారావు వెళ్ళి తలుపు తట్టగానే తలుపు తీసింది సుధ. అతన్ని చూస్తూనే ఆమె కళ్ళలో వెలుగు కనపడింది. "రండి రండి. అనుకున్నదానికంటె పదినిముషాలు ముందుగానే వచ్చేశారు" అందామె.

సుబ్బారావు లోపలకు నడిచాడు. ఆమె తలుపులు వేసింది.

అతను గదిని పరీక్షగా చూశాడు. సింపుల్‌గా ఉంది గది. గోడలో రెండు వర్ణచిత్రాలు, ఒక క్యాలెండరూ ఉన్నాయి. గదిలో నాలుగు కుర్చీలు. టీపాయ్ లేదు.

నేలంతా శుభ్రంగా తుడిచి ఉంది. ఒకపక్క కిటికీ మూడుపక్కల గుమ్మాలున్నాయి, అందులో ఒక గుమ్మం వీధిలోకి ఉంది. దాంట్లోంచే తనిప్పుడింట్లోకి వచ్చాడు.

"మీరు నాకో చిన్న సహాయం చేయాలి!" అంది సుధ.

"చెప్పండి. చేయగలిగినదైతే చేస్తాను" అన్నాడతను.

"నా భర్త తప్పిపోయారు?" అన్నదామె.

సుబ్బారావుకు నవ్వొచ్చింది. "ఎంత వయస్సుంటుంది మీ భర్తకు?" అన్నాడు.

"ఇరవై ఏడేళ్ళు" అంది సుధ.

"ఎలా తప్పిపోయారు?" అనడిగాడు సుబ్బారావు.

"ఆయనకు మతిభ్రమించింది..." అని కళ్ళనీళ్ళొత్తుకుంది సుధ.

సుబ్బారావు షాక్ తిని, "ఐసీ" అన్నాడు.

సుధ కాసేపు మౌనంగా ఉండిపోయింది.

"కాస్త వివరంగా చెప్పండి!" అన్నాడు సుబ్బారావు మౌనాన్ని భరించలేక.

సుధ గొంతు సవరించుకొని చెప్పడం మొదలుపెట్టింది. "మతిభ్రమణం అంటే పూర్తిగా పిచ్చి కాదు. సాధారణంగా మామూలుగానే మాట్లాడుతూంటారు. హఠాత్తుగా ఆయన మాట మారిపోతుంది' గంభీరంగా అయిపోయి సినిమాల్లో విలన్‌లా ప్రవర్తించడం మొదలుపెడతారు" ఒక్క నిమిషం ఆగిందామె.

సుబ్బారావు కుతూహలంగా వింటున్నాడు. సుధ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది. "ఒకరోజు రాత్రి ఆయన నాతో సరదాగా కబుర్లు చెబుతున్నారు. ఉన్నట్లుండి నావంక చూసి మిస్ సుధా. నీ నంబరు గుర్తుందా

అనడిగారు. నాకర్థం కాలేదన్నాను. నా నంబరు నూట పదమూడని చెప్పి, పనిలో ఉన్నప్పుడెప్పుడూ ఈ నంబరునే గుర్తుంచుకోవాలి అన్నారు. నాకేం అర్థం కావటంలేదండీ అన్నాను. అండీ గిండీ అనకూడదు. బాస్ అనాలి అన్నారు. వేళాకోళమనుకున్నాను గానీ ఆయన సీరియస్‌గానే ఉన్నారు. మతిభ్రమణానికి సంబంధించి అదే మొదటిసంఘటన'' అంది సుధ.

''చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది కథ'' అన్నాడు సుబ్బారావు.

''వినేవాళ్ళకి కథలాగుంటుంది. వాస్తవంలో అనుభవిస్తున్న నాకిది కథకాదు వ్యథ'' అంది సుధ.

''సుధ-కథ-వ్యథ బాగుంది'' అన్నాడు సుబ్బారావు.

''నా విషయాన్ని మీరు సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు'' అంది సుధ విచారంగా.

''ఇందులో నేను చేయగలిగినదేముంది చెప్పండి? నేను డాక్టర్ని కాదు, డిటెక్టివుని కాదు'' అన్నాడు సుబ్బారావు.

''నాకు సహాయం చేయడానికి, మీరీ ఇద్దరిలో ఏ ఒక్కరూ కానవసరం లేదు.''

''మరి...?'' అన్నాడు సుబ్బారావు.

''నేను చెప్పేది దయతో పూర్తిగా వినండి. అప్పట్నించీ ఆయన అప్పుడప్పుడు అదోలా ప్రవర్తిస్తూండేవారు. డాక్టర్ని కన్సల్ట్ చేశాను. అంతావిని డాక్టర్ ఇది మతిభ్రమణమని తాననుకోవడం లేదన్నారు. బుర్రబాగా వేడెక్కిపోతే కొంతమంది అలా ప్రవర్తించవచ్చునట. ఆ సంగతి చెప్పి ఆయన ఏవో మాత్రలిచ్చాడు. మా ఆయన స్పృహలో

ఉన్నప్పుడాయన విపరీత ప్రవర్తన గురించి చెప్పవద్దన్నాడు డాక్టర్."

"అంటే ఆయన రెండు దశల్లో జీవిస్తున్నాడన్న మాట" అన్నాను.

"అవును. ఆయన్ను వెయ్యికళ్ళతో కనిపెట్టుకొస్తున్నాను. ఒకరోజు రాత్రి ఆయన లేచి చిన్న బ్రీఫ్‌కేసు సర్దుతూ కనిపించారు. ఏమిటండీ అనడిగాను. అండీకాదు బాస్ అనాలన్నారు. తనప్పుడు అర్జంటు వ్యవహారంమీద బయటకు వెళ్ళాలట. బ్రీఫ్‌కేసు తాళంవేసి తాళంచెవి నాచేతి కిచ్చారు. ఇది చాలా స్పెషల్ తాళం. జాగ్రత్తగా దాచి ఉంచు. ఈ పెట్టెను నేను మరో ఇంట్లో దాస్తాను, అన్నారు. ఆయన్నాపడానికి ప్రయత్నించాను, ఆగలేదు. చివరకు నన్ను తోసేసి వీధితలుపులు వేసేసి వెళ్ళిపోయారు. మళ్ళీ తెల్లవారుఝామున నాలుగ్గంటలకు తిరిగొచ్చారు. మాట్లాడకుండా పడుకున్నారు" సుధ ఆగింది.

సుబ్బారావు కేదో అనుమానం కలిగింది. "ఆ తర్వాతేమైంది?" అనడిగాడు.

"ఉదయం లేచారు. టిఫిన్ చేశాక ఇద్దరం బజారు కెళ్ళాం. బజార్లో విపరీతమైన రష్‌గా ఉంది. ఆ రష్‌లో ఇద్దరం సెపరేట్ అయ్యాం. ఇప్పటికి మూడువారాలు గడిచింది. ఆయన ఐపులేరు" సుధ మళ్ళీ కన్నీళ్ళొత్తుకుంది.

"చాలా విచిత్రంగా ఉంది మీ కథ" అన్నాడు సుబ్బారావు.

"ఇది విచిత్రమైన కథ కాదు. విషాదభరితమైనది" అంటూ నిట్టూర్చింది సుధ. "మావారు మాయం కావడానికి

సంబంధించినంతవరకూ ఒక్కటే ఆధారం నాకు. ఆ రాత్రి ఇంటికి తిరిగొచ్చేక ఆయన జేబులో ఒక ఎడ్రస్ ఉంది. అది మీది!'' అంది.

''ఆశ్చర్యంగా ఉందే!'' అన్నాడు సుబ్బారావు.

''మీకూ మావారికీ ఏదో పరిచయముండి ఉండాలి'' అంది సుధ.

''ఇంతకీ మీ ఆయన పేరేమిటి?'' అన్నాడు సుబ్బారావు.

''సూర్యనారాయణ'' అంది సుధ. ''ఆయన ఫోటో కూడా తీసుకొస్తానుండండి'' అంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

సుబ్బారావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతని బుర్రలో ఏదో అనుమానం మెదిలింది.

సుధ ఒక ఫోటో తీసుకొచ్చింది. సుబ్బారావు అనుకున్నట్టుగానే అది భయంకర్ ఫోటో. ఆమె ఫోటో అతనికి చూపించి, అతని ముఖంలో మార్పులు చూస్తూ కూర్చుంది.

''ఇతనెవరో నాకు తెలియదు'' అన్నాడు సుబ్బారావు.

సుధ నిట్టూర్చింది. ''మీకు తెలుసని నా నమ్మకం. ఆయన తీసుకెళ్ళిన బ్రీఫ్‌కేస్ తాళం నా దగ్గరుంది. అందులో ఏం పట్టుకుపోయారో తెలియడంలేదు. ఆ పెట్టె, ఆయన ఎక్కడుందో చెప్పడం మీ వల్లనే అవుతుందని నా నమ్మకం.''

''ఈ విషయంలో మీకు సహాయపడగలిగింది పోలీసులొక్కరే'' అంటూ లేచాడు సుబ్బారావు. సుధ అవాక్కయిపోయింది,

6

"చూశారు కదమ్మా. ఇది చాలా పెద్ద గిన్నె. కనీసం మరో చీరయినా ఇస్తేకానీ..." అన్నాడు స్టీలుసామాన్ల వాడు.

కాసేపు వాదించిచూసి వాడివ్వడని రూఢిచేసుకుంది వనజ. అప్పుడామె మూడో చీర తీయడంకోసం మళ్ళీ ట్రంకు తెరిచింది. ట్రంక్ లో పైన దుప్పట్లున్నాయి. అవి వాడు తీసుకోడు. కాస్త అటూ ఇటూ కెలికి చూసింది. బట్టలన్నీ బైటకు లాగింది. మూడో చీర ఆమెకు దొరికింది కానీ అంతకంటె ఆశ్చర్యాన్ని కలిగించే వస్తువు కనపడిందామెకు. తళతళ మెరిసే చిన్న బ్రీఫ్ కేస్!

వనజ తాత్కాలికంగా తన కుతూహలాన్నణచుకుని, స్టీలుసామానువాడి దగ్గర బేరం ముగించి గిన్నె తీసుకుంది. వాణ్ణి ,పంపించేశాక ఆమె ఆ బ్రీఫ్ కేసును ట్రంకులోంచి బయటకు తీసింది.

దాన్ని చూస్తూంటే ఆమెకు చాలా ఆశ్చర్యంగా వుంది.

ఎక్కడిదీ బ్రీఫ్ కేస్? ఎలావచ్చిందది తమ ఇంట్లోకి? అయినా ఇంతమంచి బ్రీఫ్ కేస్ ని పాతగుడ్డల పెట్టెలో ఎవరుంచారు? పెట్టె ఖాళీదనుకుందామా అంటే చాలా బరువుగా ఉంది. ఏముందో అందులో?

వనజ ఎక్కువసేపు ఆలోచించకుండా పెట్టెను తెరవడానికి ప్రయత్నించింది. కానీ ఆ పెట్టె తెరుచుకోలేదు.

ఏముందో ఆ బ్రీఫ్ కేసులో ఎవరుంచారో దాన్నక్కడ?

'వనజ అనుమానం భర్తమీదకే పోయింది. తనకు తెలియకుండా అతనే అక్కడుంచి ఉండాలి. మరెవ్వరికీ

అటువంటి అవకాశం లేదు.

ఆమెకు భర్తమీద కోపం కూడా వచ్చింది.

ఎక్కడిదా పెట్టె? అందులో ఏముంది? ఇవే ప్రశ్నలామెను వేధిస్తున్నారు. వంటింట్లోకి వెళ్ళి ఒక పర్యాయం అట్లకాడ తీసుకువచ్చి పెట్టె తెరవగలనేమోనని చూసింది. కానీ పని జరగలేదు.

ఏమీ పాలుపోక ఆలోచిస్తున్న సమయంలో ఎవరో తలుపుతట్టిన చప్పుడయ్యింది. వనజ చటుక్కున బ్రీఫ్ కేసును మళ్ళీ ట్రంకులో ఉంచి పైన బట్టలు సర్దేసి, మూత వేసి, వచ్చి వీధితలుపు తీసింది.

ఎదురుగా ఒక ఆధునిక యువతి. వనజను చూసి దెబ్బతిన్నట్లు కనబడింది. ఆమె "అయామ్‌సారీ. ఇది సుబ్బారావుగారిల్లనుకున్నాను" అంది.

"అవును. ఇది సుబ్బారావుగారిల్లే!" అంది వనజ.

"లోపలకు రావచ్చా" అనడిగిందామె. ఆ ప్రశ్నలో ఆమె సంస్కారం ఉట్టిపడుతోంది.

"రండి" అంటూ ఆహ్వానించింది వనజ.

ఆమె కాషాయరంగు బెల్‌బాటం వేసుకుంది. చెవులకు పెద్దసైజు రింగులు. కళ్ళు ముక్కు అన్నీ తీర్చిదిద్దినట్లున్నాయి. చాలా అందమైనదని ఆడదైన వనజకే అనిపించింది.

ఆమె కూర్చుంది. "మీ పేరు?" అడిగింది వనజ.

ఆమె చాలా అందంగా నవ్వి, "సుధ!" అంది.

రూపానికి తగ్గ పేరు, అనుకుంది వనజ.

సుధ చుట్టూ పరిశీలించి చూస్తూ, "తనకో చెల్లెలున్నట్లు సుబ్బు నాకెన్నడూ చెప్పలేదే!" అంది.

సుబ్బు అన్న పదం వింతగా తోచి, "సుబ్బెవరు?" అనడిగింది వనజ.

సుధ ముఖం ఎర్రనయింది. "అది సుబ్బారావుగారికి నేను పెట్టుకున్న ముద్దుపేరులెండి" అంది సిగ్గుపడుతూ.

ఉలిక్కిపడింది వనజ. "సుబ్బారావుగారిని మీరు ముద్దుపేరుతో పిలుస్తూంటారా? మీకూ వారికీ ఏమిటి సంబంధం?'"

సుధ చలించలేదు. "అది మీ కెందుకులెండికానీ- అతనికి చెల్లెలున్నట్లు నా కింతవరకూ తెలియదు."

"సుబ్బారావుగారికి ఒక్కరేం కర్మ ముగ్గురు చెల్లెళ్ళున్నారు ముగ్గురికీ పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి" అంది వనజ.

"ఐసీ. అయితే మీరు మీ వారితో కలిసే ఇక్కడి కొచ్చారా?" అడిగింది సుధ.

"మా వారిక్కడికి రావడమేం కర్మ. ఆయన ఇక్కడే ఉంటున్నారు" అంది వనజ, సుధ మాటలు సరిగ్గా అర్థం కాకపోగా.

"ఐసీ. అయితే మీరు మీ అన్నగారింట్లో ఉంటున్నారన్నమాట" అంది సుధ తాపీగా.

"ఇది మా అన్నగారిల్లుకాదు. మా ఇల్లే" అంది వనజ చిరాగ్గా.

"ఓహ్. అయితే సుబ్బే ఇక్కడుంటున్నాడన్నమాట. మాటవరసకైనా తన చెల్లెలింట్లో ఉంటున్నట్లు నాకు చెప్పలేదే. ఈరోజు సాయంత్రం కలుసుకున్నప్పుడు అడగాలి" అంది సుధ స్వగతంలా.

ఈసారి వనజకు కథ కొంతవరకూ అర్థమైంది. ఆమె ప్రాణ్పడిపోయింది. ఎవరీ సుధ? తన భర్తను సుబ్బు అనే

చనువెలా వచ్చిందిమెకు? తరచుగా ఇద్దరూ కలుసు కుంటూ ఉంటారా?

సుధ చాలా అందంగా ఉంది. తనకంటె కూడా! ఈ సుధ ఆకర్షణకు లోనయ్యాడా? లేక సుధ తన భర్తవల్ల మోసగించబడుతోందా?

"ఈరోజు సాయంత్రం మీరు సుబ్బారావుగారిని కలుసుకుంటారా?" అనడిగింది వనజ.

"అవును" అంది సుధ కాస్త సిగ్గుపడుతూ.

"అయితే ఇప్పుడు సుబ్బారావుగారింటి కెందుకు వచ్చినట్లు? ఇది ఆయన ఆఫీసులో ఉండే టైమని తెలుసు గదా."

సుధ తడబడింది. "ఆఫీసుకు వెడితే చెప్పారు. అడ్రస్ తీసుకుని ఇంటికి వచ్చాను. సెలవుపెట్టడానికి కారణ మేమిటో తెలుసుకుని సాయంత్రం కార్యక్రమం సంగతి రూఢిచేసుకుందామని వచ్చాను."

"ఏమిటి మీ కార్యక్రమం?" అంది వనజ కాస్త దురుసుగా.

"అది మా వ్యక్తిగత విషయం" అంది సుధ దాట వేస్తున్నట్లు.

"సుబ్బారావుగారికి సంబంధించిన ఏ విషయమైనా నాకూ వ్యక్తిగతమైనదే అవుతుంది. చెప్పండి" అంది వనజ.

సుధ చిరుకోపంతో వనజను చూసి, "మీకు తెలియ దనుకుంటాను. చెల్లెలి అధికారాలు అన్నపై కలకాలం నిలబడవు. నేను అతనికి కాబోయే భార్యను" అంది.

ఉలిక్కిపడింది వనజ. అంతలోనే తేరుకుని, "అయితే

నేను వారి భార్యనన్న సంగతి మీకు తెలియదన్నమాట"
అంది.

ఈసారి ఉలిక్కిపడడం సుధ వంతయింది. ఆమె నమ్మలేనట్లు వనజవంక చూసి, "సుబ్బుకు పెళ్ళయిందా?" అంది ఆశ్చర్యంగా.

"పెళ్ళవడమేకాదు. కాపురంపెట్టి ఏడాది పూర్తయింది కూడా" అంది వనజ.

సుధ రెండు చేతుల్లోటీ ముఖం కప్పుకుంది. "నేను నమ్మలేను" అంటూ గొణుక్కుంది.

వనజ విసురుగా లోపలకు వెళ్ళింది. ఒక ఫోటో ఆల్బంతో తిరిగివచ్చిందామె. సుధకు అందిస్తూ, "ఇవి చూడండి. మీరు నమ్మగలుగుతారు" అంది.

ఆ ఆల్బంనిండా సుబ్బారావు, వనజల పెళ్ళి ఫోటోలున్నాయి.

"ఇప్పటికీ నమ్మడం కష్టంగానే ఉంది. అమాయకంగా కనిపించే సుబ్బారావు ముఖంచూస్తే అతను నాకింత ద్రోహం తలపెడతాడనుకోలేకపోతున్నాను."

ఈ పర్యాయం వనజకాస్త జాలిగా సుధవంక చూసి, "మగవాళ్ళెప్పుడూ అంతే. మీకుమాత్రమే కాదు, నాకూ ద్రోహం చేశారు. ఇప్పట్నుంచైనా జాగ్రత్తగా వుండండి" అంది.

"ఇంక జాగ్రత్తేమిటి? నా కడుపులో పెరుగుతున్న బిడ్డగతి ఏంకావాలి?" సుధ వెక్కివెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

అంత అందమైన, ఆధునిక యువతి అలా ఏడుస్తూంటే ఏదోలా అనిపించింది వనజకు. దుఃఖానికి వేషభాషలతోటి, నిమిత్తంలేదు కదా అనుకుంది.

"పెళ్ళికి వాయిదామీద వాయిదా వేస్తూంటే ఏమిటో అనుకున్నాను. ఇదన్నమాట కారణం" అంది సుధ మళ్ళీ ఏడుస్తూ.

వనజ మాట్లాడలేదు. తనుండగా సుబ్బారావు పర స్త్రీతో సంపర్కం పెట్టుకున్నాడన్న భావన ఆమెకు కంపరాన్ని కలిగిస్తోంది. ఆమె దృష్టిలో కూడా సుబ్బారావు అమాయకుడు మరి!

సుధ కళ్ళు తుడుచుకుంది. "ఈవేళ్టికి సరిగ్గా 24 రోజులక్రితం నా పుట్టినరోజుకు సుబ్బారావు బహూకరించిన డ్రస్ ఇది. అతను చెప్పిన ప్రకారం ఈ నెలలో మా పెళ్ళికావాలి. ఆరోజు నేను అతనికి ఒక బ్రీఫ్ కేస్ బహూకరించాను. అందులో ఏముందో అతనికి చెప్పలేదు. తాళంవేసి, తాళం నా దగ్గరుంచుకున్నాను. నా ప్రేమ కానుకను భద్రంగా దాచుకోమని చెప్పాను. పెళ్ళిరోజున ఆ పెట్టె తాళం తీస్తానని చెప్పాను. వివాహమయ్యేవరకూ పెట్టె అతనివద్దా, తాళం నావద్దా వివాహమయ్యేక రెండూ ఇద్దరివద్దా!" సుధ నిట్టూర్చి, "ఇంక ఆ పెట్టె తెరవబడదు మూసుకుపోయిన నా హృదయకవాటానికి మల్లే" అంది.

వనజ ఆశ్చర్యంగా, "అయితే ఆ బ్రీఫ్ కేస్ మీరిచ్చిందన్నమాట!" అంది.

సుధ కళ్ళు మెరిశాయి. "సుబ్బారావు మీకు చూపించాడా. దాన్ని మీరు చూసేరా?" అనడిగింది గబగబా.

వనజకు ఆవేశం వచ్చింది. "నా కెందుకు చూపిస్తారు? చూపిస్తే తన తప్పు బయటపడదూ. నాకు తెలియకుండా పాతబట్టల పెట్టెలో దాచేశారు. ఈవేళే అది బయట పడింది, స్టీలుసామాను వాడికి పాతబట్ట లిద్దామనుకుంటూండగా."

"ఊఁ" అంది సుధ ఆత్రుతగా.

"అందులో ఏముందోనన్న కుతూహలంకొద్దీ తెరవడానికి ప్రయత్నించాను. ఏ తాళానికీ తెరుచుకోలేదు. ఆఖరికి అట్లకాడతో కూడా ప్రయత్నించాను" అంది వనజ.

"దాని తాళం నా దగ్గరుంది. మీకెలా వస్తుంది?" అంది సుధ.

"ఏముందండీ ఆ పెట్లో?" కుతూహలంగా అడిగింది వనజ.

"ఏముంటే ఎందుకులెండి. నా తొలిప్రేమ కానుక అనర్హుడి చేతికి వెళ్ళింది. కనీసం మీ ధర్మమా అని అది నాకు తిరిగి చేరితే చాలు" అంది సుధ తిరిగి మామూలుగా.

వనజ ఇంట్లోకివెళ్ళి ఓ బ్రీఫ్ కేఫ్ తీసుకొచ్చింది. "దీని కథ తెలిసిన క్షణంనించీ నాకు గుండెలమీద కుంపట్లా ఉంది. మీ కిచ్చేయడానికి నాకేం అభ్యంతరంలేదు. కానీ ఇందులో ఏమున్నదీ చూడగోరుతున్నాను. ఒక్కసారి మీ దగ్గరున్న తాళంతో తెరిచి లోపలున్నది చూపిస్తారా?"

సుధ వ్యథతో కూడిన చిరునవ్వొకటి నవ్వి, "అందులో చూపించడానికేముందిలెండి. సుబ్బుకోసం ఒక సూట్ కుట్టించాను. మా పెళ్ళిరోజున వేసుకుంటాడని మనసు పడ్డాను. అదే ఆ బ్రీఫ్ కేసులో ఉన్నది" అంది.

"కానీ బ్రీఫ్ కేస్ చాలా బరువుగా ఉంది. సూట్ అంత బరువుగా ఉంటుందా?" అంది వనజ ఆశ్చర్యంగా.

సుధ చిరాగ్గా ముఖంపెట్టి, "ఏం బరువండీ. ఇక ముందున్న నా జీవితంకంటె బరువుగా ఉండదు" అంది.

వనజ కాస్సేపు ఆలోచించింది.

"నా భర్త వేసిన తప్పటడుగుకు ఏకైక సాక్ష్యం ఈ బ్రీఫ్ కేస్. దీన్ని ఎదుటపెట్టి ఆయన్ను రాత్రి నాలుగూ

దులిపేయాలి. మీరూ నా దగ్గరకు వచ్చినట్లు సాక్ష్యంగా మీ దగ్గరున్న తాళంకూడా ఇవ్వండి'' అంది వనజ.

సుధ ముఖం పాలిపోయింది. "నా మూలంగా మీ ఇంట్లో రభస జరగడం నా కిష్టంలేదు. నేను చెప్పినవన్నీ మీరు మరిచిపొండి.ఆ పెట్టె తీసుకుని నేనూ వెళ్ళిపోతాను. మన ముగ్గురం ఒకచోట కలవడం కానీ, నేను సుబ్బును కలుసుకోవడం కానీ మరి జరుగదని హామీ ఇస్తున్నాను."

"పెట్టె మీకు తప్పకుండా నేను ఇస్తాను. ఈ ఒక్క రోజుకూ నా దగ్గరుంటుంది. మీరు తాళంచెవి మాత్రం నాకిచ్చి వెళ్ళండి!'' అంది వనజ.

సుధ అదోరకంగా నవ్వి, "సుబ్బును కలుసుకుందామని వచ్చానుగానీ, ఈ కథంతా వింటాననీ, నా బ్రీఫ్ కేసును తీసుకుపోవలసి ఉంటుందనీ నేనూహించలేదు కదా, కూడా నేను తాళంచెవి తీసుకురాలేదు'' అంది.

"అయితే ఒక పనిచేయండి. రాత్రి ఎనిమిదిగంటలకు మీరు తాళం తీసుకుని మా ఇంటికి రండి. మిమ్మల్నెదురుగా పెట్టుకుని కడిగిపారేస్తాను. ముందు ముందు మరెన్నడూ ఆయన తప్పటడుగు వేయకుండా ఉండాలంటే– మీరు నాకీ మాత్రపు సహాయం చేయాల్సుంటుంది."

సుధ అసహనంగా, ఇబ్బందిగా కదిలింది. వనజ గమనించలేదు కానీ ఆమె కన్నుల్లో కొద్దిగా కోపచిహ్నాలు కూడా ఏర్పడ్డాయి. "ప్రస్తుతం నా మనసు వికలమై పోయింది. ఇంక నేనీ ఊళ్ళో క్షణంకూడా ఉండలేను. ఇంటికివెళ్ళి, సామాను సర్దుకుని వెళ్ళిపోదల్చుకున్నాను. మళ్ళీ మీ ఇంటికి రాలేను."

వనజ అదోలా నవ్వింది. "మీ ప్రేమ కానుకను

వెనక్కి తీసుకువెళ్ళాలంటే ఈవేళ రాత్రి ఎనిమిది గంటలకు రండి. అవసరం లేదనుకుంటే రాకండి. రేపు మధ్యాహ్నం పన్నెండుగంటలకి, ఈ పెట్టెను నేనే స్వయంగా కిరసనాయిలు పోసి తగలెట్టేస్తాను'' అంది.

సుధ ఏమిటో ఆలోచిస్తూంది. ఇంతలో వీధితలుపులు తోసుకుని ఎవరో వచ్చారు. "ఎవరో చుట్టాలొచ్చి నట్లున్నారు వనజమ్మా'' అంటూ.

వచ్చినావిడ పొరుగింటి పద్మావతి. సుధ మరక్కడ ఉండలేదు. మళ్ళీ వస్తానని సెలవు తీసుకుంది.

7

"మధ్యాహ్నం సుధ అనే అమ్మాయి వచ్చింది. మీకు పెళ్ళికాలేదనుకుని మిమ్మల్ని ప్రేమించి మోసపోయినట్లు నన్ను చూశాకనే ఆమెకు తెలిసింది. తను మీకు ప్రేమ కానుకగా ఇచ్చిన బ్రీఫ్‌కేస్‌ను వెనక్కి తీసుకుపోవాలని ఆమె కోరిక. పాతబట్టలు ఇచ్చి స్టీలుసామాను కొనడానికి ట్రంకుపెట్టి తెరిస్తే అందులో నాకు తెలీకుండా మీరు దాచిపెట్టిన బ్రీఫ్ కేసు కళ్ళబడింది. అందువల్లఆ బ్రీఫ్ కేసు వివరాలు నాకు తెలుసును. వెంటనే ఆమెకు దాన్ని చూపించాను'' వనజ కోపంగా భర్తతో చెబుతూవుండగా సుబ్బారావు కంగారుపడి—

"అయితే కొంపదీసి ఆ బ్రీఫ్‌కేస్ ఆమెకు ఇచ్చేశా వేమిటి?'' అన్నాడు.

"ఇవ్వలేదు. అదింకా మనింట్లోనే ఉంది'' అని వనజ ఇంకా ఏదో అనబోతూండగా సుబ్బారావు చటుక్కున ఆమెను దగ్గరగా లాక్కుని ముఖంనిండా ముద్దులతో నింపేసి, "నువ్వెంత తెలివైనదానివి. ఆ బ్రీఫ్‌కేసును ఇచ్చేయకుండా ఉంచావు'' అన్నాడు సంతోషంగా.

వనజ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అవునండి. అది ప్రేమకానుకగా ఇచ్చిన వస్తువు. ఇంట్లోంచి ఇంకా పోలేదని మీకు సంతోషంగా ఉంది."

సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. అతను సావధానంగా ఆమె చెప్పినది విని, తనకు తెలిసినవన్నీ వివరంగా ఆమెకు చెప్పాడు. వనజ ముందో పట్టాన నమ్మలేదు. చివరకు కూడా సగం సగమే నమ్మింది.

"నువ్వు నమ్ము, నమ్మకపో, జరిగిందిది. ఆ బ్రీఫ్ కేస్ కోసం సుధ ప్రయత్నిస్తోంది. ఇంతకాలం దాని ఆచూకీ తెలియదు. ఇప్పుడు నీ మూలంగా తెలిసిపోయింది. నా అభిప్రాయంలో ఆమె భయంకర్ శత్రువర్గానికి చెందినది. బహుశా ఈ రాత్రి దాడి జరిగినా జరగవచ్చు. జాగ్రత్తగా ఉండాలి మనం," అన్నాడు సుబ్బారావు—

వనజ ముఖంలో భయం స్పష్టంగా కనబడింది. ఒక్కక్షణం ఆలోచించి, "నిజాన్ని చాలాకాలం మీరు దాచిపెట్టటంవల్లనే ఇలా జరిగింది. ముందే నాకు అన్ని విషయాలూ చెప్పివుంటే ఏ ఇబ్బందీ ఉండివుండేది కాదు. ఇప్పుడేం చేయాలో మీరే చెప్పండి" అంది.

సుబ్బారావు ఆలోచించాడు. "ఆఁ మంచి ఐడియా" అన్నాడు. వనజ అతనివంక కుతూహలంగా చూసింది.

"మనకు కాస్త ఖర్చవుతుంది. కానీ గత్యంతరం లేదు. ఇప్పుడింకా టైము ఆరుగంటలు దాటలేదుకదా. బజారుకు వెళ్ళి ఇలాంటిదే బ్రీఫ్ కేసు ఒకటి కొందాం. దాన్నిండా రాళ్ళునింపి ఇంట్లో ఉంచుదాం. రెండో బ్రీఫ్ కేస్ మాత్రం జాగ్రత్తగా రహస్యంగా దాచి ఉంచుదాం."

"బాగానే ఉంది కానీ, ఖరీదెంతుంటుందో ఏమో" అంది వనజ.

"ఎవర్శైకి లోపుండదు" అన్నాడు సుబ్బారావు పెదిమ విరిచి.

"నైలెక్స్ చీర వస్తుంది" అంది వనజ బాధగా.

"ఏంచేస్తాం. నువ్వు చీరలిచ్చి స్టీలుసామాను కొనడం వల్ల ఈ ఇబ్బందొచ్చింది. అదికూడా స్టీలుసామాను కిచ్చావని సరిపెట్టుకో" అన్నాడు సుబ్బారావు.

ఇద్దరూ కాసేపు బాధపడ్డారు.

"మరి బజారుకు నేనూ రానా?" అంది వనజ.

"వస్తే బ్రీఫ్‌కేస్‌ను కాపలా ఎవరు కాస్తారు?" అన్నాడు సుబ్బారావు.

"అమ్మబాబోయ్. ఎవరైనా మీరులేని సమయంలో వచ్చివాడితే నేనేం చేయాలి?"

"అలా భయపడకు. దొంగల్లాంటి వారెవరైనా రావాలంటే కాస్త చీకటి పడాలి. ఆ టైముకి నే నెలాగూ వస్తాను."

వనజకు అంత తృప్తికరంగాలేదు. "పోనీ, బ్రీఫ్‌కేస్‌ను మనం కూడా తీసుకుపోతే" అంది.

"అది చాలా ప్రమాదం. ఎవరు వచ్చినా నువ్వు తలుపు తీయకు."

సుబ్బారావు ఇంట్లోంచి బయటపడ్డాడు. వనజ తలుపుకు గడియపెట్టి వరండాలోనే కూర్చుంది.

వనజకు ఏమీ తోచటంలేదు. ఆ పెట్టెలో ఏముందో చూడాలనిపించింది. బ్రీఫ్‌కేసుని తీసి, పెట్టె తెరవడానికి చాలా ప్రయత్నించింది. కాని అది తెరుచుకోలేదు.

సాధారణంగా ఇలాంటి పెట్టెలకు ఎక్కడో చిన్న మీటలుంటాయని ఎవరో అనటం గుర్తొచ్చింది వనజకు.

హాండిల్ ప్రాంతంలో అటూ ఇటూ చేత్తో తడవడం మొదలుపెట్టింది.

హఠాత్తుగా బ్రీఫ్‌కేస్ మూత తెరుచుకుంది. ఉలిక్కిపడి పెట్టెను జారవిడిచింది.

వనజ కళ్ళు చెదిరిపోయాయి.

బ్రీఫ్‌కేస్ నిండా వందరూపాయల నోట్లకట్టలు. బహుశా ఖరవై లక్షలదాకా ఉండి ఉండవచ్చు.

అంతలో- ఎవరో వీధితలుపు తట్టారు. వనజ ఉలిక్కిపడింది. గబగబా బ్రీఫ్‌కేసును సర్ది దాచేసింది. ఊపిరి బిగపట్టుకు కూర్చుంది. ఎవరో తలుపు ఇంకా తడుతూనే ఉన్నారు.

అయిదు నిముషాలు గడిచాయి. వనజకు ఓపిక నశించింది కానీ అవతలి వ్యక్తి ఇంకా తలుపు తడుతూండడం జరుగుతూనే ఉంది.

"ఎవరూ?" అని అరిచింది వనజ చిరాగ్గా. ఆ చిరాకు వెనుక చిరు భయంకూడా ఉంది.

సమాధానం రాలేదు. తలుపుమాత్రం మరి కాస్త గట్టిగా తట్టడం జరిగింది.

భయంవేసింది వనజకు. ఏంచేయాలో పాలుపోలేదు. ఏమైతే అయిందని ధైర్యంచేసి వెళ్ళి తలుపు తీసింది.

ఒక వ్యక్తి లోపలకువస్తూ, "సుబ్బారావుగారున్నారాండీ!" అన్నాడు.

చూడ్డానికి మనిషి మర్యాదస్తుడల్లే ఉన్నాడు. వయసు కూడా ముప్పై దాటదు. అతనెవరా అని ఆలోచిస్తూనే వనజ, "లేరండీ!" అంది.

"ఇప్పుడు వచ్చేస్తారా?"

"ఇంక వచ్చే టయిమవుతోందండి" అంది వనజ.

"ఆయనతో చాలా ముఖ్యమైన పనుందండీ. వచ్చే దాకా కూర్చుంటాను" అన్నాడతను.

"ఇంట్లో ఇంకెవ్వరూ లేరండీ" అంది వనజ ఇబ్బందిగా.

"మీరున్నారుగదా చెల్లాయి" అన్నాడతను. అతను చెల్లాయి అని పదం ఉచ్ఛరించిన తీరు చాలాబాగుంది. అంగులో ఆప్యాయత ఉట్టిపడుతోంది.

వనజకు అభ్యంతరం పెట్టాలనిపించలేదు. "రండి. లోపలకు!" అందామె.

అతను లోపలకువచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"మీ పేరు?" అడిగింది వనజ.

"భయంకర్!" అన్నాడతను సోఫాలో వెనక్కు జారగిలబడుతూ.

8

సుబ్బారావు తిన్నగా సూట్ కేసులమ్మే షాపుకు వెళ్ళాడు. అదృష్టవశాత్తూ అతనికి తను కోరుకున్నలాంటి బ్రీఫ్ కేస్ కళ్ళబడింది. సుబ్బారావు దాన్ని పరిశీలించి చూశాడు. చూడ్డానికి అచ్చం అలాగే ఉంది.

"ఎంత?" అడిగాడు సుబ్బారావు.

"తొంభై రెండ్రూపాయలు" అన్నాడు షాపువాడు.

"టూమచ్" అన్నాడు సుబ్బారావు.

షాపువాడు నవ్వాడు. "ఇది మామూలు బ్రీఫ్ కేస్ కాదు సారు. ఒకసారి మూసేసేరంటే తెరవడానికి దీని తాళంతో తప్ప సాధ్యంకాదు. మరే తాళంతోనూ తెరవలేరు. తర్వాత దీనికొక స్పెషల్ బటన్ ఉంటుంది. అది నొక్కితే ఎప్పుడైనా తెరవగలుగుతారు."

"ఎక్కడుంది ఆ స్పెషల్ బటన్" అన్నాడు సుబ్బారావు ఆసక్తిని చూపిస్తూ.

"అది మాకూ తెలియదు. ఈ బ్రీఫ్ కేసుతో పాటు ఒక సీల్డు కవర్ మాకు వస్తుంది. అందులో దాని వివరాలుంటాయి. కొనుక్కున్నవాడికి తప్ప మరెవ్వరికీ ఆ వివరాలు తెలియకూడదని మ్యానుఫాక్చరర్స్ ఉద్దేశ్యం."

"చాలా బాగుంది కానీ, ఇలాంటి బ్రీఫ్ కేసులు చాలా తయారవుతున్నాయి గదా. అప్పుడు చాలామందికి రహాశ్యం తెలిసిపోదూ."

"అన్నింటికీ ఒకటే సీక్రెట్ అయితే మరి సీల్డుకవరు కూడా ఎందుకుసార్. ప్రతి బ్రీఫ్ కేసుకూ ఒక కొత్తరకం ఏర్పాటుంటుంది" అన్నాడు షాపువాడు గర్వంగా.

బేరమాడగా రెండ్రూపాయలు తగ్గించాడు షాపువాడు. సుబ్బారావు సీల్డుకవర్ తీసుకున్నాక, "పరీక్షించాలనుకుంటే, మీరు ట్రయల్ రూంలోకి వెళ్ళవచ్చు" అంటూ దారిచూపించాడు షాపువాడు.

సుబ్బారావు ట్రయల్ రూంలో సీల్డుకవర్ తెరిచాడు. దాంట్లో వివరాల ప్రకారం, పెట్టె అడుగున నేలమీద ఆనుకోవడంకోసం ఉన్న నాలుగు సపోర్ట్సులోనూ ఒక దాంట్లో ఉంది స్పెషల్ బటన్. అది నొక్కగానే బ్రీఫ్ కేస్ తెరుచుకుంది.

"చాలా బాగుంది" అనుకున్నాడు సుబ్బారావు. లోపల ఉన్న ప్యాకింగ్ మెటీరియల్ని అలాగే ఉంచి, మరో అయిదురూపాయలు వెచ్చించి కాగితాలు వగైరాలు కొని దాన్ని నింపాడు. ప్యాకింగ్ మెటీరియలూ, తెల్ల కాగితాలూ కలిపి పెట్టె కాస్త బరువుగానే ఉంది.

సుబ్బారావు షాపులోంచి బయటకు రాగానే, ఒక రిక్షావాడు పలకరించాడు, "రిక్షాకావాలా బాబూ" అని.

తను వెళ్ళవలసిన చోటు చెప్పాడు సుబ్బారావు. "అర్థరూపాయిప్పించండి బాబూ" అన్నాడు రిక్షావాడు.

సుబ్బారావు ఆశ్చర్యపడ్డాడు. దూరం మరీ ఎక్కువ కాకపోయినా ఎవడూ రూపాయకి తక్కువ కట్టడు తన ఇంటికి. తను చెప్పినది వాడు సరిగ్గానే విన్నాడని మరో సారి అడిగి రూఢి చేసుకున్నాక సుబ్బారావు రిక్షా ఎక్కాడు.

ఈరోజు రాత్రి చాలా పెద్ద విశేషమే జరగవచ్చునని సుబ్బారావుకు తోస్తోంది. ఇంటిదగ్గర పాపం వనజ ఒక్కత్తే ఉంది. ఏంచేస్తోందో ఏమో, అసలే ఒంటరిగా ఉండడానికి భయపడింది.

సుబ్బారావు తనకొన్న బ్రీఫ్ కేస్ గురించే ఆలోచిస్తున్నాడు. అది ప్రత్యేకమైన సదుపాయంతో చేయబడింది. భయంకర్ తనకిచ్చినది కూడా అచ్చం ఇలాగే ఉంది. దానికి కూడా ఏదో స్పెషల్ బటన్ ఉండివుంటుంది. ప్రయత్నించి అందులో ఏముందో తెలుసుకోవాలి!

ఉత్సాహంగా ఆలోచిస్తూ సుబ్బారావోసారి టైము చూసుకున్నాడు. ఏడూ ముప్పై అయిదయింది. ఎంత వరకూ వచ్చామోనని చుట్టూ చూశాడు. రిక్షా మామూలు దారిలో వెళ్ళడంలేదు.

"ఏ దార్లో తొక్కుతున్నావ్. నేను చెప్పిన చోటుకి వెళ్ళడానికిది దారికాదు" అన్నాడుసుబ్బారావు.

"ఇది అడ్డదారి బాబూ!" అన్నాడు రిక్షావాడు.

"ఇదేం అడ్డదారి. నాకూరు తెలీదనుకున్నావా?" అన్నాడు సుబ్బారావు చిరాగ్గా.

రిక్షావాడు మాట్లాడలేదు. సుబ్బారావు మరోసారి చుట్టూ చూసి, "పెందరాళే వెడదామనుకుని రిక్షా

ఎక్కితే నువ్వు తప్పుదారి పట్టించావు. ముందోసారి రిక్షా ఆపు. ఎలా వెళ్ళాలో చూద్దాం'' అన్నాడు.

''మీ కంత గా తెలిసినప్పుడు, నేను తప్పుదారిపట్టి నప్పుడే చెప్పాల్సింది. నా బండికి బ్రేకుల్లేవు. మంచి డౌన్లో పోతోంది. ఆ సందు మొగదగ్గర ఆపుతాన్లెండి'' అన్నాడు రిక్షావాడు.

''చాలా బాగుంది'' విసుక్కున్నాడు సుబ్బారావు. రిక్షా సందు మొగదగ్గర ఆగింది. సుబ్బారావు రిక్షా దిగాడు. ఒక పర్యాయం చుట్టూ చూశాడు. దగ్గర్లో బస్ స్టాపెక్కడుందో చూడాలని అతని ప్రయత్నం. అయితే బస్ స్టాపుకంటే ముందు అతనికళ్ళ కక్కడొక అందమైన యువతి కనబడింది. ఆమె సుధ!

సుధ పక్కన ఒక దృఢకాయుడున్నాడు. చేయెత్తు మనిషి, కండలు తిరిగిన శరీరం, కోరమీసాలు, ఉన్న ఆ మనిషి చింతనిప్పుల్లాంటి కన్నులతో సుబ్బారావుని ఉరిమి చూస్తున్నాడు. సుధమాత్రం అందంగా నవ్వుతోంది. ఇద్దరూ సుబ్బారావువైపు నడిచి వస్తున్నారు.

9

''ఎనిమిది గంటల అయిదునిముషాలయింది'' అన్నాడు అసహనంగా భయంకర్. ''ఇంత ఆలశ్యం జరుగుతుందనుకో లేదు. వ్యవహారం నా పీకలమీదకు వచ్చేలాగుంది!''

''నాకూ ఏమిటో బెంగగా ఉంది అన్నయ్యగారూ. ఇంత ఆలస్యం ఎందుకు జరిగిందో తెలియడంలేదు'' అంది వనజ. అతన్ని బంధుత్వపువరసలో పిలవడం చాలా అవసరమని వనజ భావిస్తోంది.

''అసలెక్కడికి వెళ్ళారాయన?'' అన్నాడు భయంకర్ ఆదోలా.

“ఎవరో ఆయనకు దాచమని చిన్న బ్రీఫ్ కేస్ ఒకటిచ్చే రట. అది ఆయన ఒక స్నేహితుడింట్లో భద్రంగా దాచా రట. ఆ స్నేహితుడీ రోజు ఊరికిపోతున్నాడు. అందుకని బ్రీఫ్ కేసు తీసుకువస్తానని ఆరుగంటలకు బయల్దేరారు. న్యాయంగా ఏడుగంటలకే రావాల్సింది మరి” అంది వనజ. బ్రీఫ్ కేస్ ఇంట్లోనే ఉందన్న నిజం భయంకర్ కు తెలియకూడదు. ఉంటే తన్ను బెదిరించి ఇప్పుడే తీసుకు వెడతానంటాడు. అసలితను నిజంగా భయంకర్ అవునో, కాదో తనకు తెలియదు.

వనజ మాటలు విన్నాక భయంకర్ ముఖంలో ఆందోళన కనబడింది. “మైగాడ్!” అనుకున్నాడతను.

కాసేపు మళ్ళీ ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. భయంకర్ మళ్ళీ టైమ్ చూసుకున్నాడు. “సుబ్బారావు గారికేదో ప్రమాదం సంభవించి ఉండవచ్చునని నాకు తోస్తోంది. ఆ బ్రీఫ్ కేస్ ఆయన స్నేహితుడి ఇంట్లోకాక, తనవద్దనే దాచి ఉంచవలసింది” అన్నాడతను.

వనజ కటువంటి భయమేమీ లేదు. ఆ బ్రీఫ్ కేస్ ఇంట్లోనే ఉన్నదని ఆమెకు తెలుసును. ఎటొచ్చీ భర్త ఆలశ్యానికి కారణం మాత్రం తెలియడం లేదామెకు. “ఇంతకీ ఆ బ్రీఫ్ కేస్ గురించి మీకు తెలుసా?” అనడిగిం దామె సంభాషణ నడపడం కోసం.

“నేనే ఆయనకు బ్రీఫ్ కేస్ దాచమని ఇచ్చాను” అన్నాడు భయంకర్.

వనజ ఆశ్చర్యాన్ని నటిస్తూ, “ఆశ్చర్యంగా ఉందే. నాకెన్నడూ ఆయన ఈ విషయం చెప్పలేదే” అంది.

“నేను వీలైనంత రహస్యంగా ఉంచమని చెప్పాను.

ఎందుకంటే ఇది చాలా ప్రమాదకరమైన విషయం'' అన్నాడు భయంకర్.

వనజ కుతూహలంగా, ''ఇంతకీ ఆ బ్రీఫ్ కేసులో ఏముందండీ'' అంది.

''ఏమో. నాకూ తెలియదు'' అని మళ్ళీ టైము చూసు కున్నాడు భయంకర్. ''అబ్బా. ఎనిమిదీ ఇరవై అయింది. నేను పావుతక్కువ తొమ్మిదివరకూ ఉంటాను. అప్పటి వరకూ కూడా సుబ్బారావుగారు రాకపోతే, ఆయనకూ, నాకూ కూడా ప్రమాదం సంభవించవచ్చు.''

''ప్రమాదమంటే?''

''నాకు తెలిసిన ప్రమాదం ఒక్కటే. అదే ప్రాణాలు పోవడం'' అన్నాడు భయంకర్.

వనజ గుండెల్లో రాయిపడింది. ఆమె దృష్టి టేబిల్ మీద ఉన్న అలారం గడియారంమీద పడింది. హఠాత్తుగా అది వేగం పుంజుకుని పరిగెడుతున్నట్లనిపించిందామెకు.

10

సుబ్బారావుకు భయంవేసింది. సుధ పక్కనున్నలాంటి మనుషుల నింతవరకూ సినిమాలలో మాత్రమే చూశాడు. అతను జేబులోంచి ఓ అరరూపాయతీసి రిక్షావాడి చేతిలో పెట్టి, ''బాబూ, నీకూ, నీ రిక్షాకూ ఓ నమస్కారం'' అని కాస్త జనం బాగా ఉన్న హోటల్ వైపు నడిచాడు.

''హలో సుబ్బారావుగారూ'' అన్న సుధ పిలుపు వినపడింది. అయినా వినిపించుకోనట్లు సుబ్బారావు ముందడుగు వేశాడు.

''హలో సుబ్బారావుగారూ మిమ్మల్నే'' మళ్ళీ పిలిచింది సుధ. అయినా వినకుండా సుబ్బారావు ముందుకు నడు స్తూంటే ఒక వ్యక్తి ఆపి, ''మీ పేరు సుబ్బారావాండీ.

వెనకాలెవరో అమ్మాయి మిమ్మల్ని పిలుస్తోంది'' అన్నాడు.

''నా పేరు సుబ్బారావుకాదు'' అంటూ ఆ వ్యక్తిని విడిపించుకుని ముందుకు వెళ్ళాడు సుబ్బారావు.

ఈ పర్యాయం నాలుగంగల్లో సుబ్బారావుని చేరి, అతని ముందు అడ్డంగా నిలబడి, ''పిలిస్తే పలకరేమండీ సుబ్బారావుగారూ'' అంది సుధ.

''నా పేరు సుబ్బారావుకాదు'' అన్నాడతను.

''అయితే ఇదివరకు మీ పేరు అబద్ధం చెప్పేరన్నమాట. కానీ మీ పేరు సుబ్బారావని నేను ఋజువు చేయగలను'' అంది సుధ.

''ఎలా?''

''మిమ్మల్ని బాగా ఎరిగున్న మీ చేత నిజం చెప్పించగల వ్యక్తి మీ వెనకాల ఉన్నాడు, చూడండి'' అంది సుధ. కాస్త కఠినంగా సుబ్బారావు వెనక్కి తిరిగాడు. ఆ వృద్ధకాయుడు చింతనిప్పుల్లాంటి కళ్ళతో తనవంక చూస్తున్నాడు. సుధ ఉద్దేశ్యం అతనికి అర్థమయింది. గుండెల్లో కాస్త బెదురుకూడా కలిగింది.

సుబ్బారావు ముక్తసరిగా, ''అతను కూడా నాకు తెలియదు'' అంటూ ముందుకు వెళ్ళబోయాడు. సుధ అతని చేయి పట్టుకుంది. అది చాలా చక్కని హాయైన స్పర్శ.

''నాకు మీతో పనిలేదు. మర్యాదగా మీ చేతిలో ఉన్న సూట్ కేస్ నాకిచ్చేయండి. లేకపోతే చిక్కుల్లో పడతారు. బహుశా ప్రాణాలుకూడా పోవచ్చు'' అంది సుధ వీలైనంత నెమ్మదిగా.

''ఇది మీ కిచ్చినా నా ప్రాణాలుపోతాయి. ఏదైనా దౌర్జన్యానికి దిగేరా, మీ రంగు బయటపెట్టి పదిమందినీ

పిలిచి ఇప్పుడే అన్నీ చెప్పేస్తాను. మర్యాదగా వెనక్కి వెళ్ళిపోండి" అన్నాను సుబ్బారావు ధైర్యం కూడగట్టు కొని. సుధకు అతని కళ్ళలో దృఢనిశ్చయం కనబడింది.

"ఎవర్నిలా లొంగదీయాలో నాకు బాగా తెలుసు లెండి. మీ వెనుకనున్న అతనెవరో తెలియదన్నారుగదా అతి త్వరలో అతన్నిగురించి చాలా తెలుసుకుంటారు. అతని పరిచయం కూడా లభిస్తుంది" అని సుధ అతని చేయి వదిలిపెట్టింది.

సుబ్బారావింక రిక్షా ఎక్కే తలపు మానుకున్నాడు. అతను బస్టాపుకు వెళ్ళి బస్సు వచ్చేవరకూ ఆగి బస్సు ఎక్కాడు. దృఢకాయుడు, సుధకూడా అదే బస్సు ఎక్కారు.

11

భయంకర్ అసహసంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. మాటిమాటికీ టైము చూసుకుంటున్నాడు. ముఖంలో ఆత్రుత, ఆందోళన సమపాళ్ళలో కనబడుతున్నాయి.

"ఇంక లాభంలేదు. టైమైపోయింది. మరి నేను వస్తాను. ఇంక సుబ్బారావుగారిని దేవుడే కాపాడాలి" అంటూ అతను వీధిలోకి నడిచాడు. సరిగా అదే టైముకి అతనికి సుబ్బారా వెదురయ్యాడు, చేతిలో బ్రీఫ్ కేసుతో. అతను పరుగులాంటి నడకతో వస్తున్న మూలాన ఇంచుమించు భయంకర్ ని గుద్దినంత పనిచేశాడు.

సుబ్బారావుని చూస్తూనే భయంకర్ ముఖం వెలిగింది. "అమ్మయ్య. నన్ను రక్షించేరు, మీరు రక్షించబడ్డారు" అన్నాడు.

సుబ్బారావు భయంకర్ ని గుర్తుపట్టాడు. "వచ్చేరా.

బ్రీఫ్ కేస్ కోసం సుధ అనే ఒక అమ్మాయీ, ఒక వృద్ధ కాయుడూ నా వెంటబడ్డారు. ప్రాణాలతో ఇల్లు చేరు కుంటాననుకోలేదు" అన్నాడు.

భయంకర్ నవ్వి, "ప్రస్తుతానికి వ్యవధిలేదు" అంటూండగా ఇంటిముందు ఓ టాక్సీ ఆగింది. "వస్తాను మరి" అంటూ భయంకర్ సుబ్బారావు చేతిలోని బ్రీఫ్ కేస్ తీసుకుని, "మెనీ మెనీ థాంక్స్" అంటూ వెళ్ళి టాక్సీ ఎక్కాడు.

సుబ్బారావు ఏదో చెప్పబోయేంతలో టాక్సీ వెళ్ళి పోయింది.

సుబ్బారావు వీధిలోకి చూశాడు. సుధ, వృద్ధకాయుడు కూడా జరిగింది చూసినట్లున్నారు. వెనక్కు తిరిగి వెళ్ళి పోయారు.

సుబ్బారావు ఇంట్లో అడుగుపెట్టాడు. వనజ ముఖంలో రకరకాల భావాలతో అతనివంకే చూస్తోంది.

"పొరబాటు జరిగిపోయింది వనజా. నా చేతిలోని తన సూట్ కేస్ ననుకుని భయంకర్ తీసుకువెళ్ళిపోయాడు. నిజం చెప్పే వ్యవధికూడా ఇవ్వలేదు" అన్నాడతను పాలి పోయిన ముఖంతో.

"బహుశా అన్నీ మనమంచికే జరుగుతాయండీ. ఇలా ఎందుకు జరిగిందో" అంది వనజ.

"ఎలాగో అలా జరిగిన పొరపాటు భయంకర్ కి తెలియ జేయాలి" అన్నాడు సుబ్బారావు.

"భలేవారే. పొరపాటు జరిగితే అతనికి మాత్రం తెలియదా" అంది వనజ.

"అదీ నిజమే. కానీ పొరపాటు నేను కావాలని చేశానని భయంకర్ కి అనుమానం తగిలితే."

"ఇంతవరకూ అన్నీ మనం అనుకున్నట్లు జరిగాయి కనుకనా, జరుగబోయేది ఊహించడానికి" అని విసుగ్గా అందివనజ. "ఏమండీ. భయంకర్ మరి మనింటికి రాకుండా ఉంటే బాగుండునండీ. ఆ బ్రీఫ్ కేస్ మన సొంతమైపోతే బాగుండునండీ."

"అవేం మాటలు. అందులో ఏముందో కూడా మనకు తెలియదు."

"నాకు తెలుసు. అందులో ఏముందో?"

సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. "ఎలా తెలుసు?"

వనజ జరిగిందంతా చెప్పింది. "అందులోని డబ్బు ఇరవై లక్షలకు తక్కువుండదనుకోండి."

"ఇరవై లక్షలే!" సుబ్బారావుకు గుండె ఆగినంత పనయింది. అతను ఉరకలు పరుగులమీద ధనలక్ష్మి దర్శనం చేసుకోవడానికి వెళ్ళాడు.

12

"చిల్లర నోట్లు కావాలి!" అన్నాడు సుబ్బారావు.

క్యాషియర్ వందరూపాయల నోటందుకుని ఒక పర్యాయం పరిశీలనగా చూశాడు. తర్వాత దాన్ని క్యాషు బాక్సులో పడేసి ఇరవై అయిదురూపాయ నోట్లు లెక్కపెట్టి సుబ్బారావు కందించాడు.

సుబ్బారావు మనసు సంతోషంతో నిండిపోయింది. భయంకర్ ఇచ్చిన బ్రీఫ్ కేసులోని ఒకేఒక నోట్లకట్ట తీసుకున్నాడతను. అవి దొంగనోట్లయి ఉండవచ్చునని బాగా అనుమానంగా ఉందతనికి. కానీ అది నిజంకాదని ఇప్పుడే తేలిపోయింది.

తను నిజంగా అదృష్టవంతుడేమో! కొన్ని లక్షలు స్వాధీనంలో ఉన్న పెట్టె తనవద్ద వదిలేసి, చెత్త

కాగితాలున్న పెట్టె తీసుకుపోయాడు భయంకర్. జరిగిన పొరపాటు గ్రహించి అతను తిరిగివస్తాడనుకుందామంటే, అప్పుడే వారంరోజులు గడిచిపోయాయి. ఈరోజే అతను ధైర్యంచేసి ఒకేఒక కట్టతీసి అవి దొంగనోట్లవునో, కాదో తెలుసుకుందామనుకున్నాడు. అవి అసలు నోట్లే అని తేలి పోయింది.

అయితే ఇప్పుడేంచేయాలి?

మంచినోట్లయితే భయంకర్ వదులుకుంటాడా? మళ్ళీ తప్పక వస్తాడు. డబ్బు ఏమాత్రం తగ్గినా ప్రాణాలు తీస్తాడు. కానీ డబ్బు సొంతం చేసుకోవాలని వనజ ప్రాణాలు తీస్తోందిప్పుడు.

భయమూ సంతోషమూ సమపాళ్లలో కలుగుతున్నాయి సుబ్బారావుకి. అతను ఇల్లు చేరేసరికి గుమ్మంలో ఆత్రుతగా ఎదురుచూస్తున్న వనజ పలకరించింది. "ఏంజరిగింది?" అంటూ.

"మంచివే!" అన్నాడు సుబ్బారావు. అతను లోపలకు రాగానే, "ఎంత అదృష్టం?" అంది వనజ. సుబ్బారావు తలుపులు వేశాడు.

"ఇంక భయపడకండి. హాయిగా ఉండి అనుభవించ లేకపోవడమేం కర్మ" అంది వనజ.

"భయంకర్ చాలా భయంకరమైన వ్యక్తి!" అన్నాడు సుబ్బారావు.

"కానీ మనం అదృష్టవంతులం. అదృష్టవంతుల్నెవ్వరూ ఏమీ చేయలేరు."

"ఏం అదృష్టమో. చేతినిండా డబ్బుండీ ఖర్చుపెట్టుకో లేని దురదృష్టవంతులమైపోయాం" అన్నాడు సుబ్బారావు నిట్టూరుస్తూ.

"అనవసరంగా మీరే వెనకదీస్తున్నారు. లేకపోతే లక్షరూపాయలకు సరిపడ ఖర్చుగురించి అప్పుడే ప్లాను వేసి ఉంచాను" అంది వనజ.

"తల్లీ. నువ్వంతదానివే. కానీ మన ప్రాణాలమీదకు రాకుండా ఎలా చూడ్డమా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు సుబ్బారావు.

ఎవరో తలుపుతట్టిన చప్పుడయింది. సుబ్బారావే వెళ్ళి తలుపు తీశాడు.

లోపలకు వచ్చిన వ్యక్తి భార్యాభర్తల కిద్దరకూ కూడా అపరిచితుడే! సుమారు నలభై సంవత్సరాలుంటాయతనికి. మనిషి నల్లగా ఉన్నాడు. అతని బట్టలు, ముఖకవళికలను బట్టి చూస్తే చాలా గొప్పవాడని ఊహించవచ్చు.

"నాపేరు శ్యామసుందర్!" అన్నాడతను.

"నాపేరు సుబ్బారావు. రండి, కూర్చోండి!"అన్నాడు సుబ్బారావు.

శ్యామసుందర్ వచ్చి కూర్చున్నాడు. సుబ్బారావు భార్యను కూడా పరిచయంచేసి,"మిమ్మల్నెన్నడూ కలుసుకున్న గుర్తులేదండీ నాకు" అన్నాడు.

శ్యామసుందర్ నవ్వి, "మనం కలుసుకోవడం ఇదే మొదటిసారి. కానీ మీగురించి మా విశ్వనాధంద్వారా విన్నాన్లెండి" అన్నాడు.

"విశ్వనాధం ఎవరండీ. నాకు తెలిసినవాళ్ళలో ఆ పేరు గల వాడెవ్వరూ లేరే" అన్నాడు సుబ్బారావు. కాఫీ కలపవలసి ఉంటుందనే ఉద్దేశ్యంతో వనజ లోపలకు వెళ్ళింది.

"మా విశ్వనాధానికి అసలుపేరు చెప్పే అలవాటు లేదులెండి. మీతో ఏ భయంకరో అని చెప్పుంటాడు."

"మీ మాటలేవీ నా కర్థం కావడంలేదు. కాస్త

సూటిగా విషయం చెప్పగలిగితే బాగుంటుంది" అన్నాడు సుబ్బారావు నిరుత్సాహంగా.

"సూటిగా చెప్పవచ్చుననుకోండి కానీ ఇది సూటి అయిన వ్యవహారమేం కాదు" అన్నాడు శ్యామసుందర్. "లక్ష్మీనారాయణ పేరు మీరు వినే ఉంటారు."

"ఇంతవరకూ మీరు చెప్పిన పేర్లన్నీ కొత్తవే నాకు" అన్నాడు సుబ్బారావు రవంత చిరాకును ప్రదర్శిస్తూ.

"ఆయనకు పేరులోనే కాకుండా ఇంటినిండా లక్ష్మి ఉంది. ఆయన కెన్నో లావాదేవీలున్నాయి. ఎన్నో వ్యాపారాలున్నాయి" అని శ్యామసుందర్ ఆగాడు. సుబ్బారావు మాట్లాడకుండా కుతూహలంగా వింటున్నాడు.

"ఆయన చాలా గొప్పవాడు. ఆయనచుట్టూ గొప్పవాళ్ళే తిరుగుతూంటారు. ఆయనకు పోలీసులంటే భయం లేదు. దొంగలంటే భయంలేదు. మంత్రులంటే భయంలేదు. మంత్రాంగాలంటే భయంలేదు. చిన్నవాళ్ళవైపు కన్నెత్తయినా చూడడు. పెద్దవాళ్ళనయినా చిన్నచూపు చూస్తాడు. లక్ష్మీప్రసన్నుడు కాబట్టి ఆయన కన్నివిధాలా సాగుతోంది."

వనజ కాఫీలు తీసుకొచ్చింది. శ్యామసుందర్ వాక్ప్రవాహానికి ఆనకట్టపడింది.

13

కాఫీ సిప్ చేస్తూ శ్యామసుందర్ చెప్పసాగాడు. వనజ మాత్రం లోపలకు వెళ్ళిపోయింది. "సుందరరావు అనే ఓ సైంటిస్టు ఏణ్ణర్థంక్రితమే అమెరికానుంచి తిరిగివచ్చాడు. అతను స్వంతంగా ప్రయోగశాల పెట్టుకుని ఏవేవో పరిశోధనలు చేసుకుంటూండేవాడు. ఆరునెలలక్రితం అత

నొక కొత్త సంచలనాత్మకమైన విశేషం కనిపెట్టాడు. అతను రూపొందించిన యంత్రం సహాయంతో మసిబొగ్గును వజ్రంగా మార్చవచ్చు.''

''మసిబొగ్గులో కానీ, వజ్రంలో కానీ ఉన్న మూల పదార్థం కార్బన్ అని నాకూ తెలుసు. ఆర్టిఫిషియల్ డైమండ్స్ చేయడానికి చాలామంది శ్రమించారు, శ్రమిస్తున్నారు. చాలా ఖర్చవుతుందందుకు. అధికంగా అట్టే ప్రయోజనకారిగా ఉండకపోవచ్చుకూడా'' అన్నాడు సుబ్బారావు.

శ్యామసుందర్ నవ్వాడు. ''సుందర్రావు ప్రయోగం అందరిలాంటిదీ కాదు. పదార్థాలు క్రిస్టల్ స్ట్రక్చర్ మార్చుకు నేందుకు అతనొక యంత్రం కనిపెట్టాడు. అది తయారు చేయడానికి యాభైవేలు లోపే అవుతుంది. అంతేకాదు, పదివేలరూపాయలు విలువచేసే వజ్రాన్ని సుమారు అయిదు వందల రూపాయల ఖర్చులో తయారు చేయవచ్చు.

ఈ ప్రయోగాన్ని సొమ్ముచేసుకుని, ఆ సొమ్ముతో మరిన్ని ప్రయోగాలు చేసుకోవచ్చునని అతని ఆశ. వ్యాపారం పేరుతో సమయం వృథా చేసుకోవడం అతని కిష్టంలేదు.

తన ప్రయోగఫలితాన్ని ఎనిమిది లక్షలకు లక్ష్మీ నారాయణగారికి అమ్మడానికి బేరం కుదిరింది చివరకు. అదెలా జరిగిందంటే, లక్ష్మీనారాయణగారు ముప్పై లక్షలరూపాయలు ముందుగా సుందర్రావుకి సమర్పించాలి. అవీ అన్నీ వందరూపాయల నోట్లు సీరియల్ నెంబరువు. సుందర్రావు ఇన్విజిబుల్ ఇంక్‌తో (కనిపించని సిరా) ఆ నోట్లమధ్యనున్న తెల్లని ఖాళీప్రాంతంలో యంత్రం తయారుకు అవసరమైన ఫార్ములాలు, వివరాలు వగైరాలన్నీ

సప్లిమెంట్ పోటీ - 23.

103, 104, 105, 106, 107 — అంకెలను తీసుకొని మీకు నచ్చిన వరుసక్రమంలో, ఈ క్రింది గళ్ళను పూరించండి. మీ జవాబులను ఒక పోస్టుకార్డుసైజు తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసల స్టాంపులు జతపరిచి, ఈ నెల 30 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి.

మా ఆఫీసులో సీలు చేసిన జవాబుతో సరిపోలిన జవాబుకు ఏడాదిపాటు 'సప్లిమెంట్', ఉచితంగా పంపుతాం. ఫలితాలు అక్టోబరు '76 నెల మాసపత్రికలో చూడండి.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "సప్లిమెంటు" ముఖచిత్రాలు పరిశీలించండి. రెండింటికీ సంబంధం ఉండేటట్లుగా ఒక్క మాటలో గాని, చిన్న వాక్యంలోగాని, వ్రాసి, ఈ నెల 10 వ తేదీ లోపు మాకు చేరేట్లు పంపండి.' హోమ్ డెలివరీ' సభ్యులు తమ సభ్యత్వము నెంబరు వ్రాస్తేచాలు. సభ్యులు కానివారు తమవ్యాఖ్యలతో 30 పై.లు స్టాంపులుపంపాలి.

మాకు నచ్చిన వ్యాఖ్యలలో అత్యుత్తమమైన వ్యాఖ్యకు రూ. 20 లు నగదు బహుమతి పంపుతాము.

మీరే ఎన్నుకోండి ?

ఈ "సప్లిమెంటు"లో మీకు బాగా నచ్చిన నవల పేరును ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10 వ తేదీ లోపు మాకు పంపండి. హోమ్ డెలివరీ సభ్యులు తమ నెంబరు తప్పక వ్రాయాలి. ఇతరులు తమ జవాబుతో ఈ కూపన్ కత్తిరించి పంపాలి. ఉత్తమ నవలకు రూ. 116 లు బహుమతి ఇవ్వబడుతుంది. *

రాస్తాడు. సుందర్రావు అంచనా ప్రకారం మొత్తం సుమారుగా, ఇరవై రెండువేల వందరూపాయల నోట్లు కావాలి, ఆ వివరాలన్నీ రాయడానికి. వివరాలు రాసి డబ్బుని లక్ష్మీనారాయణగారికి సమర్పించుకోవలసి ఉంది. ఇక్కడే ఒక చిన్న తమాషా జరిగింది'' శ్యామసుందర్ ఆగి, ''కాస్త వక్కపొడుందా'' అనడిగేడు.

''వనజా'' సుబ్బారావు పిలిచేడు. సమాధానంగా వక్కపొడి డబ్బాతో వనజ వచ్చింది. 'తను కూడా వింటోందన్నమాట' అనుకున్నాడు సుబ్బారావు.

వక్కపొడి నములుతూ శ్యామసుందర్ మళ్ళీ చెప్పడం ఆరంభించేడు.

''సైంటిస్ట్ సుందర్రావు, లక్ష్మీనారాయణగారిని స్వయంగా కలుసుకుని సుమారు ఇరవై రెండు లక్షలున్న బ్రీఫ్ కేసుని అందించాడు. 'అందులోని వివరాలు మరెవ్వరూ చదవలేరు. నేను స్పెషల్ గా తయారుచేసిన ఇన్విజిబుల్ ఇంక్ తో రాశాను వివరాలు' అంటూ ఆయనకో పెన్ను కూడా అందించాడు. దానికి రెండువైపులా కూడా కాప్స్ ఉన్నాయి. 'ఒకపక్క కాప్ తీసి రుద్దారంటే, నేను రాసిన వివరాలు కనబడతాయి. మళ్ళీ రెండోపక్క కాప్ తీసి రుద్దారంటే ఆ అక్షరాలు మళ్ళీ మాయమవుతాయి' అని అతను లక్ష్మీనారాయణరావుగారికి చెప్పాడు. ఆయన సైంటిస్ట్ చెప్పినవన్నీ పరీక్షించి నిజమేనని రూఢి చేసుకున్నాడు.

ఆ పెన్ను నాయన చాలా భద్రంగా ఎక్కడో దాచారు. కాని ఫార్ములాలున్న నోట్లున్న బ్రీఫ్ కేసు గురించి ఆయన అంత పట్టించుకోలేదు. జాగ్రత్తగా దాచమని తన భార్య శ్యామలకిచ్చారు. ఆమె దాన్ని భద్రంగా

గాడ్రెజ్ అల్మరాలో దాచింది.

మర్నాడు లక్ష్మీనారాయణగారు తనకు తెలిసిన ఇంజనీర్లతో సంప్రదించడానికని ఒక సమావేశం ఏర్పాటుచేసి, అక్కడికి ఈ బ్రీఫ్ కేసును తీసుకురమ్మన్నారు. శ్యామల స్వయంగా తనే తీసుకువెళ్ళింది ఆ బ్రీఫ్ కేసు. అక్కడున్న టేబిల్ మీద పెట్టింది. లక్ష్మీనారాయణగారు ఆమె వెళ్ళవచ్చునన్నట్లుగా సైగ చేసి, తను టేబిల్ వద్దకు వెళ్ళారు. బ్రీఫ్ కేస్ తెరవబోయి ఆగిపోయారు. కారణం... కాసిని మంచినీళ్ళిప్పిస్తారా..." అన్నాడు శ్యామసుందర్.

సుబ్బారావు, వనజను పిలవలేదు. రెండు నిముషాల్లో వనజ మంచినీళ్ళు తీసుకుని వచ్చింది. ఈసారి ఆమె మరి లోపలకు వెళ్ళకుండానే అక్కడే ఓ కుర్చీలో కూర్చుంది.

శ్యామసుందర్ మంచినీళ్ళు తాగి, "ఆ బ్రీఫ్ కేస్ మీద ఒక చిన్న అస్థిపంజరం, రెండు బొమికలతో ప్రమాదం గుర్తువేసిన ఒక కాగితం అంటించబడి ఉంది. దానిమీద రెండేరెండు వాక్యాలు వ్రాయబడి ఉన్నాయి. "లోపల బాంబు ఉంది. పెట్టె తెరిస్తే బాంబు పేలి డబ్బూ, ఫార్ములాలూ కూడా నాశనమౌతాయి" అని రాసి ఉంది.

లక్ష్మీనారాయణగారి ముఖం ఎర్రబడింది. ఆయన ముందుగా భార్యదగ్గరకు వెళ్ళి, "శ్యామా, పెట్టె ఎక్కడ దాచావ్?" అనడిగేడు. శ్యామల చెప్పింది. ఆయన వెళ్ళి అల్మరాను పరీక్షించాడు. భార్యను రకరకాల ప్రశ్నలు వేసిన మీదట ఆయనకు తెలిసిన విషయమేమంటే, తాళాలు అప్పుడప్పుడు తను పనిమనుషుల కిస్తూంటుందనీ, నిన్నటిదినం మామూలు పనిమనిషి కాకుండా కొత్తమనిషి వచ్చిందనీ తెలిసింది.

లక్ష్మీనారాయణగారు పనిమనిషిని ఆరాతీశారు. ఆ ఒక్క రోజూ తన బదులు వెళ్ళడానికి మరో మనిషి కోరిందనీ, ప్రతిఫలంగా పాతికరూపాయ లిచ్చిందనీ, అది చెప్పింది. ఏదో పెద్ద గూడుపుఠాణీ జరిగిందని లక్ష్మీ నారాయణగారికి తోచింది. కానీ ఏమిటి చేసేది? ఎనిమిది లక్షలు విలువచేసే ఫార్ములా వివరాలూ, ఇరవై లక్షల రూపాయలూ ఒక్క దెబ్బతో పేలిపోతాయి. అలా జరగడం ఆయన కిష్టంలేదు.''

''ఆయనకే ఏమిటిలెండి. ఎవరికిమాత్రం ఇష్టంగా ఉంటుంది?'' అంది వనజ.

శ్యామసుందర్ కొనసాగించాడు. ''తాత్కాలికంగా వాళ్ళ సమావేశం వాయిదాపడింది. మర్నాడు లక్ష్మీ నారాయణగారికో ఉత్తరం వచ్చింది. బాంబు పేలకుండా పెట్టె తెరిచే విధానం తమకు తెలుసుననీ అయితే అందుకు ప్రతిఫలంగా తమకు ఆ బ్రీఫ్ కేసునీ, ఫార్ములా వివరాలను కనబడేలాచేసే పెన్నునూ, తమ కందజేయాలనీ, అలా చేసిన పక్షంలో అతనికి నష్టంకలుగని విధంగా ముప్పై లక్షలరూపాయలున్న మరో బ్రీఫ్ కేసు లక్ష్మీనారాయణ గారి కందచేయబడుతుందనీ అందులో సారాంశం. ఎవరో చాలా తెలివిగా ఆడుతున్న పథకమిదని లక్ష్మీనారాయణ గారికి తెలిసిపోయింది. కానీ ఏంచేయగలరు?''

''రిస్కు తీసుకుని బ్రీఫ్ కేసు తెరవ్వలసింది'' అన్నాడు సుబ్బారావు.

''చెప్పడమంత సులువుకాదు, చేయడం. బ్రీఫ్ కేస్ తెరిచారంటే ఇరవై లక్షలతోపాటూ ఫార్ములాలు కూడా ఎగిరిపోతాయి. మరి ఆ ఫార్ములాలు లక్ష్మీనారాయణ గారికి దొరకవు'' అన్నాడు శ్యామసుందర్.

"మళ్ళీ సైంటిస్టు సుందర్రావు దగ్గర కొనుక్కో వచ్చుగా."

"లక్ష్మీనారాయణగారి సంగతులు మీకు పూర్తిగా తెలియవు. ఒక పర్యాయం ఆ ఫార్ములాలు తన చేతికి చిక్కాక, సుందర్రావు మరెవ్వరికీ వాటిని అమ్మకుండా ఉండేలా చేయడంకోసం, ఆయన తగు జాగ్రత్త తీసుకున్నారు. బాగుతో వజ్రాలు చేయాలనుకుంటే ఇప్పుడు సైంటిస్ట్ సుందర్రావు, లక్ష్మీనారాయణగారి సాయమైనా కోరాలి. లేదా మళ్ళీ పరిశోధన ప్రారంభించాలి. తను మనుషుల్ని పెట్టించి, ఫార్ములాలు కొన్నరాత్రే, సుందర్రావు దగ్గర దానికి సంబంధించి ఉన్న సమాచారమంతా నాశనం కావించారు లక్ష్మీనారాయణగారు."

"లక్ష్మీనారాయణగారు చాలా తొందరపడ్డారు."

"ఆ విషయం ఆయన ఆలస్యంగా గ్రహించారు. అందుకే ఆయన నా తమ్ముడు విశ్వనాథాన్ని పిలిపించారు. బ్రీఫ్ కేసును అతనికిచ్చి కొంతకాలంపాటు దాన్ని భద్రంగా ఎవరికీ అనుమానం తగలని చోట దాచి ఉంచమన్నారు. ఈలోగా తను శత్రుదారుల ఆచోకీ తెలుసుకోవాలని ఆయన ఆలోచన. విశ్వనాథానికి ఆయన బ్రీఫ్ కేసు గురించిన వివరాలన్నీ చెప్పారు. అందులో ఇరవై రెండు లక్షల రూపాయలు, ఎనిమిదిలక్షల విలువచేసే ఫార్ములాలూ ఉన్నాయనీ, బ్రీఫ్ కేసు తెరిస్తే పేలిపోతుందనీ, అందువల్ల చాలా జాగ్రత్తగా కాపాడాలనీ ఆయన వాణ్ణి హెచ్చరించారు. నా తమ్ముడి సామర్థ్యంమీద ఆయనకు నమ్మకం ఉంది. ఆయన ఎంత ప్రమాదకరమైన వ్యక్తో తమ్ముడికీ తెలుసు. అందువల్ల తిరుగులేని ఏర్పాటది" శ్యామసుందర్ ఒక్కక్షణం ఆగాడు.

"చాలా విచిత్రంగా ఉంది మీరు చెబుతున్నది......" అన్నాడు సుబ్బారావు,

"ముందు జరిగినదింకా విచిత్రంగా ఉంటుంది—" అంటూ శ్యామసుందర్ మొదలు పెట్టాడు— "నా తమ్ముడికి బ్రీఫ్ కేసు ఇచ్చేక లక్ష్మీ నారాయణగారు నన్ను పిలిచి —కథంతా వివరించి కుట్రదారుల ఆచూకీ తీయమన్నారు. ఫలితంగా నేను తమ్ముడి ననుసరించాల్సి వచ్చింది. వాడు బ్రీఫ్ కేస్‌తో ఉండగా ఒక అమ్మాయి వాణ్ణి వెంటాడింది. నే నామెనో కంట కనిపెడుతూ వచ్చాను. విశ్వనాథం ఈ ఊరు వచ్చాడు. ఆమె వాణ్ణి వెంటాడుతూనే ఉంది. ఈ ఊరు చేరిన రోజు రాత్రి ఆమె వాణ్ణి కలుసుకుని తన ఇంటికి రమ్మని ఆహ్వానించింది. వాడామె దురాలోచనని గుర్తించాడు. అందుకే బలవంతంగా ఆమెను వదిలించుకుని కనపడ్డ టాక్సీ ఎక్కేశాడు. మరో టాక్సీలో ఆమె వాడిని వెంటాడింది. అప్పుడు నేను తగిన జాగ్రత్త తీసుకుని ఆమె టాక్సీని తప్పుదారి పట్టించ గలిగాను. అంతేకాదు. ఆమెతో పరిచయాన్ని కూడా సంపాదించ గలిగాను..."

"ఆమె పేరు—" అడిగాడు సుబ్బారావు.

"ఆమెకు చాలా పేర్లున్నాయ్ — నాకు తెలిసిన పేరు సుధ!" అన్నాడు శ్యామసుందర్.

సుధ పేరు వింటూనే సుబ్బారావు, వనజ కూడా ఉలిక్కి పడ్డారు— "సుధా?" అన్నాడు సుబ్బారావు అప్రయత్నంగా.

"అవును మీకు తెలుసా— ఆమె!" అడిగాడు శ్యామసుందర్.

"తెలుసున నే చెప్పవచ్చు. ముందు మీ కథ కాని

వ్వండి—" అన్నాడు సుబ్బారావు.

కొద్ది రోజులు గడిచాయి. లక్ష్మీనారాయణగారు టెలిగ్రామ్ ఇచ్చారు విశ్వనాథానికి. బ్రీఫ్ కేసుతో వెంటనే వచ్చి తనని కలుసుకోవాలని. ఆయన చెప్పారంటే, అదెంత ఖచ్చితమైన ఆజ్ఞయైనదీ విశ్వనాథానికి తెలుసు. అందుకే వాడు వెళ్ళాడు_ అన్న టైము ప్రకారం బ్రీఫ్ కేసుతో. లక్ష్మీనారాయణగారు బ్రీఫ్ కేసు తెరిచారు. చూశారు. అందులో ఏముందో తెలియదు. మరు క్షణం విశ్వనాథం ఈ లోకంలో లేడు_ లక్ష్మీనారాయణగారి మనిషి వాణ్ణి కాల్చి చంపేశాడు ఆయన కనుసైగనందుకుని. అయితే ఇంతకూ అసలు బ్రీఫ్ కేస్ ఏమైంది?" శ్యామసుందర్ ఆగి ప్రశ్నార్థకంగా సుబ్బారావు వంక చూశాడు.

సుబ్బారావు మాట్లాడలేదు. ఆలోచిస్తూన్నట్లు నటిస్తూ కూర్చున్నాడు.

"నా ప్రాణానికి ప్రాణమైన తమ్ముణ్ణి పొట్టబెట్టుకున్న వాళ్ళ అంతు చూస్తాను. నేను లక్ష్మీనారాయణగారి మనిషిని_ నాకూ దయాదాక్షిణ్యాలు లేవు..." అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఇవన్నీ మీరెందుకు చెబుతున్నారో అర్థం కావడం లేదు నాకు......"అన్నాడు.

"అర్థం చేసుకుంటారనే ఆశిస్తున్నాను. ఆ బ్రీఫ్ కేస్ మీ ఇంటికి వచ్చింది. ఏ మార్పు జరిగినా మీ ఇంట్లోనే జరిగి ఉండాలి_" అన్నాడు శ్యామసుందర్ శాంతంగా.

సుబ్బారావు ఉలిక్కిపడ్డట్లు నటించి_ "అయితే అందు కన్నమాట మీరు నాకింత వివరంగా కథ చెప్పింది—" అన్నాడు.

"ఉత్తినే కథలు చెప్పడానికి నేను హరిదాసును కాదు గదా—" అన్నాడు శ్యామసుందర్ నవ్వుతూ.

"ఏమో_ ఆ సంగతి నా కెలా తెలుస్తుందండీ_" అన్నాడు సుబ్బారావు.

వనజ బుర్రలో రకరకాల ఆలోచనలు పరుగెడుతున్నాయి. ఆ బ్రీఫ్ కేసును తమ ఇంటిలో ఉంచిన వ్యక్తి చనిపోయాడని ఈ వ్యక్తి చెబుతున్నాడు. తమ ఇంట్లో బ్రీఫ్ కేస్ లేదని ఈ వ్యక్తి నమ్మితే తాము లక్షాధికారులై పోవచ్చు.

శ్యామసుందర్ లేచి నిలబడి_ "ఒక పర్యాయం మీ ఇంట్లో వెతక దల్చుకున్నాను." అన్నాడు.

సుబ్బారావు తనూ లేచి నిలబడి_ "మేము దొంగలము కాదు, మీరు పోలీసులూ కాదు_ మా ఇంట్లో మీరు వెతకడాన్ని నేను సహించ లేను" అన్నాడు.

శ్యామసుందర్ ముఖం కర్కశంగా మారింది _ "అనుకున్నది చేయకుండా నన్నెవ్వరూ ఆపలేరు. నా విషయంలో ఎవరైనా శృతిమించితే ఫలితం అనుభవిస్తారు. అదీగాక నేను ఒక కోటీశ్వరుడి ప్రతినిధిని..."

"కావచ్చు. కానీ ఈ ఇంటిమీద మీ కధికారం లేదు. ఇది నా ఇల్లు_" అన్నాడు సుబ్బారావు.

శ్యామసుందర్ ముందడుగు వేయగా సుబ్బారావు చేయి అడ్డంగా పెట్టాడు.

"వెళ్ళి వెతుక్కోనివ్వండి. ఇందులో మనం అవమాన పడవలసినదేమీ లేదు. కనపడకపోతే ఆయనే అవమాన పడాలి. మనం వారించిన కొద్దీ అనుమానం పెరగడం తప్ప ప్రయోజనం లేదు." అంది వనజ.

వనజ అలాగనడం సుబ్బారావుకు నచ్చలేదు. కానీ

ఊరుకున్నాడు. శ్యామసుందర్ ఇంట్లోకి దారితీశాడు. సుబ్బారావూ, వనజా అతిన్ననుసరించారు.

శ్యామసుందర్ మరీ తీక్ష్ణంగా శోధించలేదు. అతను గబగబా మంచాల క్రిందా, పెట్టెలలోనూ, అల్మరాలోనూ చూసేడు. ముఖంలో అనుమానం కనబడింది. వాళ్ళు ముగ్గురూ తిరిగి యథాస్థానంలోకి వచ్చేసరికి ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది. సుబ్బారావు వెళ్ళి తలుపు తీశాడు. నవ్వుతూ లోపలకు వచ్చింది సుధ. శ్యామసుందర్ ని చూసి–"హలో శ్యామ్! ఇల్లంతా వెదికినా బ్రీఫ్ కేస్ కనబడలేదు కదూ–అయినా అదిక్కడెల్లా దొరుకుతుంది?" అందామె.

శ్యామసుందర్ దెబ్బతిన్నట్లు ఆమె వంక చూసి– "యూ...యూ... నువ్వు నన్ను ఫాలో అవుతునే ఉన్నావా?" అన్నాడు.

"అవకుండా ఎలాగుండగలను? నువ్వు నన్ను మనసారా ప్రేమించిన మగవాడివి" అంది సుధ.

"ఏమిటది?"

"బ్రీఫ్ కేస్ నా దగ్గరుంది. దాంట్లో ఉన్న ఫార్ములా వివరాలన్నీ నేను సేకరించాను. డబ్బుతో నాకు పనిలేదు కాబట్టి దాన్ని మళ్ళీ నీ కిచ్చేస్తాను. ఈ విషయం లక్ష్మీ నారాయణగారికి చెప్పకు. బ్రీఫ్ కేస్ తీసుకెళ్ళి ఆయన కిస్తే నీ మాన ప్రాణాలు దక్కుతాయి – ఏమంటావ్?" అంది సుధ.

"అయితే నీ కన్నీ తెలుసు నన్నమాట!" అన్నాడు శ్యామసుందర్.

"నాకేమేమి తెలుసునో తెలుసుకుందువుగాని. నీ సమయాన్నిక్కడెందుకు వృథా చేసుకుంటావ్– నాతో

పద!" అంది సుధ.

శ్యామసుందర్, సుధ వెళ్ళిపోయిన కాసేపటి వరకూ సుబ్బారావు, వనజ ఇద్దరూ మామూలు మనుషులు కాలేదు. తర్వాత సుబ్బారావు వనజ వంక చూసి- "వనజా-బ్రీఫ్ కేస్ నిజంగానే సుధ తీసుకు పోయిందంటావా?" అన్నాడు.

వనజ నవ్వింది. "శ్యామసుందర్ కథ మొదలు పెట్టగానే నా కనుమానం వచ్చింది. ఎందుకైనా మంచిదని బ్రీఫ్ కేసుని వంటింట్లో స్టవ్ కోసం కట్టిన దిమ్మలో దాచాను. దానికొక పక్క కన్నముంది. పూడ్పించాలని చాలాకాలంగా అనుకుంటున్నాం కదా. అది పూడ్పించక పోవడం ప్రస్తుతం మన మంచికే వచ్చింది. ఎవ్వరూ ఊహించలేని చోటది."

"నువ్వెంత తెలివైనదానివి వనజా-" అంటూ సుబ్బారావామెను దగ్గరకు తీసుకున్నాడు.

14

లక్ష్మీనారాయణగారు ఆ ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నారు.

"మేము చెప్పిన మాట వినలేదు. ఫలితంగా మీ ఇరవై లక్షలూ, ఫార్ములాలూ కూడా పేలిపోయాయి. విశ్వనాథం ఆ నోట్ కేసును ఒక స్నేహితుడి వద్ద దాచాడు. ఆ స్నేహితుడు కుతూహలం కొద్దీ ప్రయత్నించి దాన్ని తెరవగలిగాడు. ఫలితంగా డబ్బూ, ఫార్ములాలు కూడా పోయాయి. ఆ స్నేహితుడికి స్వల్ప గాయాలూ తగిలాయి.

ఆ స్నేహితుడు విశ్వనాథానికి జరిగింది చెప్పలేదు. మరో కొత్త బ్రీఫ్ కేస్ కొనిచ్చాడు. అది తీసుకునే అతను మీ వద్దకు వచ్చాడు. అది మీ బ్రీఫ్ కేస్ కాని కారణం

గానే మీరు దాన్ని తెరవలేకపోయారు. చివరకు పెట్టె కవరు కోయించేశారు. అందులో కనబడ్డ చిత్తు కాగితా లను చూసి విశ్వనాథం మీద అలిగారు. విశ్వనాథాన్ని చంపించారు.

తర్వాత శ్యామసుందర్ని పంపించారు బ్రీఫ్ కేస్ తీసుకు రమ్మని. అతను మాత్రం ఏం చేయగలడు? ఏదోవిధంగా మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నించడం తప్ప.

అతను తెచ్చే బ్రీఫ్ కేస్ మీరు తెరవాలనుకుంటే కవరు కోయించనవసరం లేదు. బ్రీఫ్ కేసు మీద చిన్న డిజైను గీసి ఉంటుంది. అందులో మధ్య ఒక బొడిపె లాంటి దుంటుంది. దాన్ని నొక్కి పట్టుకుని, అప్పుడు మిగతా బ్రీఫ్ కేసులకు మల్లేనే తెరివాలి. తెరిచాక అందులో ఏముంటుంది?

వందరూపాయల నోట్లకట్టలుంటాయి. వాటిమీద ఫార్ములాలూ ఉంటాయి. నోట్లకట్టలను పరిశీలించి చూడండి. వాటిలో బహుకొద్దిమాత్రమే నోట్లు. మిగతాది తెల్లకాగితాలు. సుందర్రావిచ్చిన పెన్నుతో ఫార్ములాలను చదవడానికి ప్రయత్నించండి. ఆ ఫార్ములాల సహాయంతో ఈ ప్రపంచలోని ఏ సైంటిస్టూ ఏ యంత్రాన్నీ తయారు చేయలేడు.

మా తప్పు లేకపోయినా మామూలుగా మీరు చాలా నష్టపోయారు. ఇంకా మీరు నష్టపోవడం ఇష్టంలేక, ఈ ఉత్తరం రాస్తున్నాం."

ఉత్తరానికి అడుగున సంతకంలేదు.

లక్ష్మీనారాయణకు చాలా కోపంగా ఉంది. జీవితంలో ఇటువంటి పరాభవాలు ఎదురుకాలేదాయనకు. ఎందులో వేలుపెట్టినా లాభాలు రావడమూ, ఏ పని తలపెట్టినా

ఎదురులేకపోవడమూ మాత్రమే ఇంతవరకూ ఆయన అనుభవంలోకి వచ్చిన విశేషాలు. ఇలా జరగడం ఇదే ప్రథమం.

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని అసహనంగా పచార్లు చేస్తున్నాడాయన.

అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది. "యేస్" అన్నాడాయన. పనివాడొకడు లోపలకు వచ్చి, "శ్యామసుందర్ గారు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారండి" అన్నాడు.

"రమ్మను" అన్నాడు లక్ష్మీనారాయణ ముక్తసరిగా.

శ్యామసుందర్ లోపలకు వచ్చాడు. అతని ముఖంలో విజయగర్వం కనపడుతోంది. హుందాగా నడుచుకుంటూ వచ్చి చేతిలో ఉన్న బ్రీఫ్ కేస్ అక్కడున్న టేబిల్ మీద పెట్టాడు.

"కూర్చో!" అన్నాడు లక్ష్మీనారాయణ.

శ్యామసుందర్ కూర్చుని, "చాలా శ్రమపడి పట్టుకో గలిగాను, విశ్వనాథం బ్రీఫ్ కేస్ దాచిన ఇంటిని. ఎంతగానో బెదిరించవలసి వచ్చింది దీన్ని చేజిక్కించుకోవడానికి" అన్నాడు.

ఏ భావమూ ముఖంలో కనిపించనీయకుండా, "మంచిది. నీ శ్రమకుతగ్గ ఫలితముంటుంది. ఇక నువ్వు వెళ్ళవచ్చు" అన్నాడాయన.

శ్యామసుందర్ లేచాడు. ఆయనదగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళంగానే లక్ష్మీనారాయణ, ఉత్తరంలో చెప్పిన విధంగానే ప్రయత్నించి బ్రీఫ్ కేస్ తెరిచాడు. అందులో నోట్లకట్టలున్నాయి. పరిశీలించగా ఉత్తరంలో రాసింది నిజమే. నోట్లు పైపైన మాత్రమే ఉన్నాయి. మిగతావన్నీ తెల్లకాగితాలే.

సుందర్రావు తనకిచ్చినపుడు అన్నీ వందరూపాయలు నోట్లకట్టలే! అతను ఫార్ములాల పేరు చెప్పి బ్రీఫ్ కేస్ ఇవ్వగానే ఆయన ఏ మోసమూ ఉండకుండా చూసు కున్నాడు. ఫార్ములా గురించి కూడా పరిశీలించేముందు తనకు తోచిన నోటుమీద సుందర్రావిచ్చిన పెన్నుతో పరిశీలించి చూశాడు. ఏమీ మోసంలేదని రూఢిచేసు కున్నాకనే, దాచమని భార్యకిచ్చాడు.

లక్ష్మీనారాయణ కళ్ళు ఎర్రపడ్డాయి. శరీరం ఆవేశంతో వణికింది. ఆ ఎరుపూ, ఆ వణుకూ చాలు, ఒక నిండు ప్రాణం పోవడానికి.

15

"ఈపాటికి శ్యామసుందర్ చచ్చి ఉంటాడు" అంది సుధ.

"అతను చావడంవల్ల ఎవరికి ప్రయోజనం?" అన్నాడు సుబ్బారావు.

"భలేవారే. ఇరవై రెండు లక్షలరూపాయలు మీ దగ్గర చిక్కడిపోయాయన్న రహస్యం తెలిసిన ప్రమాద కరమైన వ్యక్తి అతను. అతను పోవడంవల్ల ఎవరికి ప్రయో జనమో మీకే తెలియదా."

"ఇరవై రెండు లక్షలరూపాయలు మా దగ్గర చిక్కడి పోయాయన్న విషయం మాకే తెలియదు. అతనికి తెలుసు నని మే మెలాగనుకోగలము?" అంది వనజ.

"వెరీగుడ్. భార్యాభర్తలంటే అలాగుండాలి. కానీ ఎవరైనా పాముతో చెలగాటాలాడడం మంచిదికాదని గుర్తుంచుకోండి. మీ దగ్గర ఇరవై రెండు లక్షలరూపాయ లున్న బ్రీఫ్ కేసుంది. అత్యాశకుపోయి దాన్ని స్వంతం చేసుకోవాలనుకున్నారు. కానీ ఇప్పుడు ప్రాణాలమీదకు

వచ్చింది. ప్రాణంకంటె డబ్బెక్కువకాదు గదా. అందుకని అది మాకు స్వాధీనంచేసి మేమిచ్చే అయిదు లక్షల రూపాయల బహుమతితోనూ తృప్తి చెందండి..." సుధ ఇంకా ఏమో చెప్పబోతూండగా—

"ఏమిటీ బ్రీఫ్ కేస్ ఇచ్చేస్తే అయిదులక్షలు ప్రతి ఫలమా?" అంది వనజ నమ్మలేనట్లు. సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు.

"మీ రిద్దరూ తెలివైనవారు. బాగా ఆలోచించుకోండి' మీ జీవితాలు కొన్ని తరాలపాటు సుఖంగా గడిచి పోవడానికి అయిదు లక్షలరూపాయలు చాలు. ఆ బ్రీఫ్ కేసును మీరు స్వంతంచేసుకుని హాయిగా బ్రతకలేరు' అడుగడుగునా గండాలే, క్షణక్షణమూ భయాలే, ఆ జీవితం మీకు సుఖంగా ఉండదు. బాగా ఆలోచించుకో మని మరోసారి హెచ్చరిస్తున్నాను" అంది సుధ.

"ఎందుకా బ్రీఫ్ కేస్ కోసం ఇంత కష్టపడుతున్నారు?" అన్నాడు సుబ్బారావు.

"అనుకోకుండా ఇంట్లోకి వచ్చినప్పుడే దాన్ని మీరు వదలలేకుండా ఉన్నారే. అటువంటిది స్వంతం చేసుకోవా లని చాలాకాలంగా ప్రయత్నిస్తున్న దానికోసం ఎంత యినా కష్టపడాల్సి ఉంటుంది మేం."

"ఇంతకీ ఎవరు మీరు?" అన్నాడు సుబ్బారావు.

"అది మీకు అప్రస్తుతం. ఆ రహస్యం తెలియకే లక్ష్మీ నారాయణగారు కూడా కొట్టుమిట్టాడిపోతున్నారు. మాకు కావలసింది బ్రీఫ్ కేస్. అందులో డబ్బుకంటె ఆ డబ్బు మీదున్న ఫార్ములాలు మాకు చాలా విలువైనవి."

"పాపం చాలాకాలంగా శ్రమపడుతున్నారు. మీ తెలివితేటలు కూడా అద్భుతం. బలవంతుడైన శత్రువుతో తలపడి నెగ్గుకు రాగలుగుతున్నారు."

"బలవంతుడైన శత్రువు గురించి మాకు బెంగలేదు' ఎత్తుకు పైఎత్తులువేసి వాళ్ళని పడగొట్టడం మాకు తెలుసు. కానీ మీబోటివారితోటే ఇబ్బంది వస్తోంది. ఇంతవరకూ మా కారణంగా హత్యలు జరుగలేదు. ముందు కూడా ఆ అవసరం లేకుండా ఉంటే బాగుండును."

సుబ్బారావు తీవ్రంగా ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

"ఒకవేళ మీ కిచ్చామనుకోండి. వెంటనే మాకు అయిదులక్షలూ ముడతాయా?" అడిగింది వనజ.

"ముట్టవు. మీరు కనీసం వారంరోజులు ఎదురు చూడాలి. మమ్మల్ని నమ్మాలి. నమ్మి ఎదురుచూడాల్సిందే" అంది సుధ.

"ఇలాంటి వ్యవహారాల్లో నమ్మకాలు పనిచేయవు. మీరు వారంరోజులు గడువడిగింది నోట్లమీదున్న ఫార్ములాలు నోట్ చేసుకుందుకే గదా. మేము మా దగ్గర ఒక అయిదు లక్షల రూపాయలుంచుకుంటాం. మిగతావి మీరు తీసుకు వెడుదురుగాని. నోట్ చేసుకోవడం అయిపోయాక మాకు వాటిలో అయిదులక్షలూ ఇచ్చేయండి. ఫార్ములాలున్న మిగతా అయిదులక్షలూ మీకు ఇచ్చేస్తాం" అన్నాడు సుబ్బారావు.

"ఏమో అనుకున్నాను. తెలివైనవారే" అది సుధ నవ్వుతూ.

"తెలివితేటల్లో మీ కెవ్వరూ సాటిరారు. మా దగ్గర బ్రీఫ్ కేసుందని కనిపెట్టారు. ఆ విషయం మాచేత ఒప్పిం

చారు. అయిదులక్షలతో ముప్పై లక్షలను కొనుక్కుంటు న్నారు'' అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు బ్రీఫ్ కేస్ తెరిచి, కొన్ని నోట్లకట్టలు పట్టుకొచ్చాడు.

''పదిహేడు లక్షల పదివేలు'' అంది సుధ లెక్క పెట్టడం పూర్తయ్యేక.

''అవును. మా దగ్గరింక సరిగ్గా అయిదులక్షల పది వేలున్నాయ్'' చెప్పాడు సుబ్బారావు.

సుధ తలాడించింది.

16

''మిస్టర్ సుబ్బారావ్. మీరు మమ్మల్ని మోసం చేశారు'' అంది సుధ.

సుబ్బారావు కంగారుగా ''ఏమిటి మీరంటున్నది?'' అన్నాడు.

వనజ భయంభయంగా సుధవంకనే చూస్తోంది. సుధ తన వానిటీ బ్యాగులోంచి ఒక కాగితం తీసిచ్చి, ''ఈ కాగితంమీద అన్ని వివరాలూ వేసి ఉంచాను. ఆ నంబరు గల నోటు వందరూపాయలది మీ దగ్గరుండిపోయింది. ఏ ఉద్దేశ్యంతో అది మీ దగ్గరుంచుకున్నారో తెలియడం లేదు'' అంది.

సుబ్బారావుకు గుర్తొచ్చింది, ఒక నోటును తను బ్యాంకులో మార్చానని.

''ఒకేఒక్క నోటుకోసం ఇంత రగడెందుకు? కావా లంటే వందరూపాయలూ మీకు చెల్లించుకుంటాను.''

''మాకు డబ్బుతో నిమిత్తంలేదు. ఆ ఒక్కనోటే కావాలి'' అంది సుధ ఖచ్చితంగా.

''ఇందులో ఏదో మోసముంది. ఒక్క నోటుకోసం

ఇంత నొక్కి స్తారనుకోలేదు. మీరు నిజంగా నా ముఖం లోకి చూసి చెప్పండి. ఒకే ఒక్క నోటు కారణంగా మీ ఫార్ములాలన్నీ పోతాయో చెప్పండి."

సుధ ముఖం సీరియస్ గా ఉంది. "మీరు చదువుకున్న సబ్జక్ట్సులో సైన్సు ఉందో లేదో నాకు తెలియదు. ప్రత్యేక మైన యంత్రాలు తయారుచేయాలంటే అన్ని విషయాలూ ముఖ్యమే. మీ దగ్గరుండిపోయిన నోటుమీద, ఈ యంత్రం తయారుచేయడానికి అవసరమైన లోహాలు ఏయే పాళ్ళలో ఉండాలో రాసి ఉంది. సైంటిస్ట్ సుందర్రావు అహో రాత్రులు శ్రమించి కనిపెట్టిన వివరాలు ఆ నోటుమీద వ్రాయబడి ఉన్నాయి. ఆ నోటు లేకపోతే పరిశోధన మళ్ళీ మొదటికి వస్తుంది."

ఈసారి వనజ మాట్లాడింది. "పోనీ ఒక పనిచేస్తే, ఆ సైంటిస్టు సుందర్రావుగారి ఒక్క సమాచారం చెప్పలేక పోదు. ఆయన్నే వెళ్ళి అడిగితే."

సుధ నవ్వి, "వెనుకటికేదో సామెత చెప్పినట్లుంది. నేను ప్రస్తుతం పడుతున్న కష్టమంతా ఎవరికోసం! సుందర్రావుగారికోసమే. ఆయన మనిషినే నేను!" అంది.

వనజ, సుబ్బారావు కూడా ఉలిక్కిపడ్డారు.

సుధ చెప్పడం ప్రారంభించింది. "సుందర్రావు ఫార్ములాలను లక్ష్మీనారాయణగారి కందించిన రాత్రి విశ్వనాథం, శ్యామసుందర్ లిద్దరూ కలిసి సుందర్రావింట్లో ఆ యంత్రానికి సంబంధించి ఉన్న సమాచారాన్నంతా నాశనం చేశారు. సుందర్రావు నిస్సహాయంగా ఈ దారుణ చర్య చూస్తూండిపోయాడు. నేను ఆయనవద్ద పర్సనల్ సెక్రటరీగా ఉంటున్నాను. జరిగింది తెలిసేక నేనాయనకు ధైర్యంచెప్పి, ప్రతీకారంగా ఎలాగో అలా ఆ ఫార్ములా

లాయరున కందజేస్తానని వాగ్దానం చేశాను. లక్ష్మీనారాయణగారితో ఆట ఆడించాను. చివరకు విజయం సాధించాను. కానీ ఇప్పుడు ఒకే ఒక్క అడ్డంకి వచ్చింది. అదే ఒక్క వందరూపాయల నోటు.''

''ఆ నోటు నా చేయిజారిపోయింది. అదెలా జరిగిందంటే...'' సుబ్బారావు వివరించి చెప్పాడు.

అంతా విని నిట్టూర్చింది సుధ, ఐదునిముషాలు మౌనంగా ఉండిపోయింది.

''ఒక పనిచేయండి. ఫలానా నంబరు వందరూపాయల నోటు ఎక్కడో పారేసుకున్నామనీ, అది తెచ్చిఇచ్చిన వాళ్ళకి పదివేలరూపాయలిస్తామనీ ఒక ప్రకటన పేపర్లో వేయించండి. రెండ్రోజుల్లో ఆ నోటు మీకు చేరుతో గలదు'' చెప్పింది సుధ.

''వందరూపాయలకు పదివేలరూపాయలా?'' అంది వనజ.

''అంతకుమించి గత్యంతరంలేదు.''

''కానీ ఆ ప్రకటన ఎవరో పిచ్చివాళ్ళు చేశారనుకోవచ్చు. ఎన్నో అనుమానాలకూడా ఆ ప్రకటన దారి తీయవచ్చు'' అన్నాడు సుబ్బారావు.

''ఏమీ భయంలేదు. అది మీ అదృష్టాన్నే మార్చివేసిన నోటనీ, అది పోవడంతో సైకలాజికల్‌గా అప్సెట్టయి పోతున్నామనీ కూడా ప్రకటించండి. మీది నడమంత్రపు సిరిగదా. ఎవరైనా నమ్మతారీ విషయం?''

''అంత అదృష్టం మార్చేసే నోటయితే మనమే ఉంచేసుకుందామనుకుని ఉంచేసుకుంటే'' అన్నాడు సుబ్బారావు సందేహంగా.

''అందుకేగా పదివేలరూపాయలు. అదేం తక్కువ

మొ త్తంకాదు."

ఆరోజే సుబ్బారావు వెళ్ళి రెండుమూడు పేపర్లలో ప్రకటన ఇచ్చాడు.

17

ప్రకటన దేశంలో గొప్ప సంచలనాన్నే కలిగించింది. దానిమీద పత్రికలలోనూ, పేపర్లలోనూ ఉత్తరాలూ, జోకులూ, వ్యాసాలూ వచ్చాయి. వందరూపాయలకు పదివేలిస్తామనడం ద్వారా మనదేశపు పౌరులుకూడా అర్థిక స్థాయిలో అమెరికన్లకు ప్రతివచ్చారని కొంతమందన్నారు. ఇందులో ఏదో తిరకాసుండకపోదు. ప్రకటించిన వాడో పెద్ద గ్యాంగు లీడరై ఉండాలని కొంతమంది వర్తమాన గూఢచారులు చెప్పుకున్నారు.

ఎవరేమనుకున్నా ఏంచెప్పుకున్నా చాలామంది ఆ నోటు కోసం ప్రయత్నించసాగారు.

ప్రకటన వెలువడ్డ ఆరురోజులవరకూ ఎవరూ అతని వద్దకు రాలేదు. ఈలోగా ఒక పర్యాయం సుధవచ్చి వెళ్ళింది. సుబ్బారావు పరిస్థితులు వివరించాడు. నోటు రాగానే కబురుపెట్టమని చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

ఆరురోజుల అనంతరం ఒకమనిషి సుబ్బారావు దగ్గరకు వచ్చాడు. "మీరు చెప్పిననోటు నా దగ్గరుంది. కానీ అందుకు ప్రతిఫలం పదివేలు చాలదు" అన్నాడు.

"పదివేలకు మించి పైసాకూడా ఇవ్వను" అన్నాడు సుబ్బారావు నిక్కచ్చిగా.

"అది మీకెంతో విలువైనదని మరిచిపోతున్నారు" అన్నాడా మనిషి.

"అది నా కదృష్టం తెచ్చిందని నా నమ్మకం. పదివేల కంటె ఎక్కువ ఖర్చుపెట్టవలసొస్తే ఇంక నాకది ఇచ్చే

అదృష్టమేముంటుంది?" అన్నాడు సుబ్బారావు.

"నేను నమ్మను. అదృష్టానికి మించి మరేదో కావాలి మీకు. అందుకే దానివిలువ లక్షరూపాయలు చేస్తున్నాను" అన్నాడా మనిషి.

"మీరు వెళ్ళవచ్చు" అన్నాడు సుబ్బారావు.

"వెడతాను. కానీ నా చిరునామా ఉంచండి. రెండ్రోజుల్లో మీరే నిర్ణయానికి రాలేకపోతే, ధర ఇంకా పెరుగుతుంది."

"నాకే చిరునామా అవసరంలేదు. ఇంకో గంటలో మీరు మనసు మార్చుకోకపోతే బహుశా నేను దాని ధర తగ్గించేస్తాను" అన్నాడు సుబ్బారావు.

ఆ మనిషి వెళ్ళిపోయేక వనజా, సుబ్బారావూ బాగా చర్చించుకున్నారు. సుబ్బారావు నిర్ణయం సమంజసమైనదే నని వనజ మెచ్చుకుంది. ఆ వందరూపాయల నోటువల్ల మరెవ్వరికీ ప్రయోజనముండదు. దానికోసం పదివేలు వెచ్చించేది తనొక్కడే. ఈ విషయం స్పష్టపడితే ఆ మనిషే నోటును తీసుకొస్తాడు. తీసుకురాకపోయినా తాము అంతకంటే ఎక్కువ ఖర్చుపెట్టదల్చుకోలేదు.

* * *

"ఏం జరిగింది? బేరం ఫైసలు చేసుకొచ్చావా?" అనడిగాడు లక్ష్మీనారాయణ.

"లేదు బాబూ, వాళ్ళు పదివేలకు మించి పైసా ఇవ్వనన్నారు. రెండ్రోజుల్లో ఏ విషయం నిర్ణయించుకోకపోతే ధర ఇంకా పెరుగుతుందని బెదిరించాను. సమాధానంగా ఒక గంటలో నే మనసు మార్చుకోకపోతే ధరని తగ్గించేస్తానని ఆయన బెదిరించాడు."

"ఓహో, అయితే మనిషేమీ చలించలేదా."

"లేదండి. కొంచెం కూడా విచారం కనబడలేదండి. అదీకాక వాళ్ళు గ్యాంగు మనుషుల్లా కనపడలేదండి. మొగుడూ, పెళ్ళాం చిలకాగోరింకల్లా ఉన్నారండి." అన్నాడా మనిషి.

"అయితే నాక్కావలసిన మనుషులు వీళ్ళు కాదన్న మాట. ఇంతకీ నువ్వు నిజంగా నోటు సంపాదించగలిగేవా?"

"లేదండి!" అన్నాడా మనిషి.

"ఎవరి దగ్గరుందో ఆ నోటు. అది సంపాదిస్తే రహస్యం బయట పడుతుంది..." అంటూ తల పంకించాడు లక్ష్మీ నారాయణ.

18

"బాగా పరీక్షించి చూడండి. ఇదే మీకాక్కావలసిన నోటనుకుంటాను..."

ఆ నోటును సుందర్రావందుకున్నాడు. అతను జేబు లోంచి పెన్నుతీసి పక్కగదిలోకి వెళ్ళాడు. అతను పెన్నుతో రుద్దగానే అక్షరాలూ అంకెలూ కనబడ్డాయి. అతని ముఖం వెలిగింది.

"సుబ్బారావుగారూ, మీరతనికి పదివేలూ ఇవ్వవచ్చు." అన్నాడు సుందర్రావు, గదిలో నుండి బయటకు వస్తూ.

ఆ అదృష్టవంతుడికి పదివేలూ ముట్టాయి. అతను వెళ్ళి పోయాడు.

"మిస్ సుధా. ఇప్పుడు మనం రెండు ఉత్తరాలు రాయాల్సుంది" అన్నాడు సుందర్రావు.

"ఎవరికి?" అంది సుధ.

"ఒకటి ప్రధాన మంత్రికి. నా ఫార్ములాను ప్రభు

త్యానికి ఇవ్వదలుచుకున్నాను" అన్నాడు సుందర్రావు.

"మీరు చాలా సహృదయులు" అన్నాడు సుబ్బారావు.

"మిస్ సుధ చాకచక్యంవల్ల నా పనులన్నీ సక్రమంగా జరిగిపోయాయి కాబట్టి, ఇప్పుడు నా సహృదయత బయట పడుతోంది" అన్నాడు సుందర్రావు.

సుధ నవ్వింది. "లక్ష్మీనారాయణగారిలాంటి వాళ్ళకు ధన మదాంధత లేకపోతే వాళ్ళను తెలివితేటలతో ఓడించడం కష్టం. ఆయన ఇంట్లో పని మనుషులను మనుషుల్లా కాక పురుగుల్లా చూస్తారు. అందుకే చాలామందిని నేనా కట్టుకోగలిగి రహస్యాలెప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చాను. ఆఖరికి నోటు విషయంలోకూడా ఆయన కన్ను పడిందన్న విషయం కూడా అలాగే తెలిసింది.

సరిలెండిగానీ, మీరు రెండుత్తరాలు రాయమన్నారు. ఒక దాని సంగతే చెప్పారు."

"రెండో ఉత్తరం రాసేక ప్రింటుచేసి అందరికీ పంపించాల్సుంటుంది." అన్నాడు సుందర్రావు నవ్వుతూ.

"అదేమిటండోయ్." అన్నాడు సుబ్బారావు.

"వందకు పదివేలివ్వగల అదృష్టవంతులు. మీకు చెప్పకుండా ఎలా కుదురుతుంది? దంపతుల్ని ఆశీర్వదించాలి కూడా......"

"అంటే శుభలేక అన్నమాట." అంది వనజ.

"మరి దంపతులెవరు?" అన్నాడు సుబ్బారావు.

"ఇంకా మీ కర్థం కాలేదా......" అంది వనజ.

సుందర్రావ్, సుధ ఒకరి వంక ఒకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకుంటున్నారు.

అర్థమైంది సుబ్బారావుకి. అప్పుడే అతనికి గుర్తొచ్చింది. "జాగ్రత్తండోయ్ సుధగారూ. ఎప్పుడైనా రాత్రి సమయంలో మీ వారు మిమ్మల్ని హఠాత్తుగా మిస్ సుధా నీ నంబరు గుర్తుందా, అనడగవచ్చు. జాగ్రత్తగా ఉండండి." అన్నాడు.

సుధ సిగ్గు పడింది. అది నటన కాదు కాబట్టి నిజంగా అందంగా ఉందా సిగ్గు.

—: ఐ పో యిం ది :—